www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
10-08-2024

సంపుటి : 01 । సంచిక : 98 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

## ఇదే మన లక్ష్యం సూచించే కొత్త నినాదం

ట్యాగ్ లైన్ ఖరారు చేసిన సీఎం రేవంత్ రెడ్డి

కాలిఫోర్నియాలో ఏఐ యూనికార్న్ కంపెనీ ప్రముఖులతో సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్:** ఇకపై మన రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్ అని పిలుద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పున ర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం "ది ఫ్యూచర్ స్టేట్"కు పర్యాయపదంగా నిలుస్తుందని సీఎం ప్రకటించారు. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో టెక్ యునికార్న్స్ సీఈఓలను ఉద్దేశించి మిగతా2లో...

## హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ రీసెర్చ్ సెంటర్



- ఈ ఏడాది చివర్లో ప్రారంభం
- మూడు వేల మందికి ఉద్యోగాలు
- సీఎం రేవంత్‌రెడ్డి హర్షం

2

## అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



2



## మది దోస్తున్న జలసాగరం

నాగార్జునసాగర్ 26 గేట్లను ఎత్తడంతో కృష్ణమ్మ నురగలు గక్కుతూ పరవళ్లు తొక్కుతోంది. పచ్చని ప్రకృతి ఒడిలో ఆవిష్కృతమైన ఈ అద్భుత దృశ్యాన్ని కనులారా తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలనుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. సాగర్ అందాలను ఆస్వాదిస్తున్నారు. ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ అధికారులు ప్రకటించడంతో శనివారం నుంచి మరింత మంది ఇక్కడికి వచ్చి సందడి చేయనున్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే సుంకిశాల పనులు

- జరిగిన నష్టాన్ని గుత్తేదారే భరిస్తారు: మంత్రి ఉత్తమ్
- ప్రాజెక్టును పూర్తిచేస్తాం: మంత్రి తుమ్మల
- నాసిరకంగా చేయడంతోనే నష్టం: మల్లు రవి, బలరాం నాయక్



**విశ్వంభర, హైదరాబాద్:** సుంకిశాలకు జరిగిన నష్టాన్ని గుత్తేదారే భరిస్తారని, ప్రజలకు, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం లేదని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అయితే నిర్మాణం పూర్తికి ఒకటిరెండు నెలలు ఆలస్యమవుతుందని తెలిపారు. జులై 2న మిగతా2లో...

## ప్రభుత్వానిది అసత్య ప్రచారం

- రేవంత్‌రెడ్డి చేతగాని తనంతోనే ప్రమాదాన్ని దాచిపెట్టారు
- హడావిడిగా గేట్లు పెట్టడంతోనే ప్రమాదం
- ఆ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే బీఆర్‌ఎస్



**విశ్వంభర, హైదరాబాద్:** సుంకిశాల ప్రాజెక్టుపై ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే బీఆర్‌ఎస్ ప్రభుత్వమని చెప్పారు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల మిగతా2లో...

## అలాంటి రూల్ పెట్టొద్దు

### హిజాబ్ నిషేధం ఉత్తర్వులపై 'సుప్రీం' స్టే

- నచ్చిన దుస్తులు ధరించే అవకాశం ఉండాలన్న ధర్మాసనం..
- స్టే ఆర్డర్‌ను ఎవరూ దుర్వినియోగం చేయొద్దని బెంచ్ స్పష్టం
- సవరణలు కోరేందుకు కళాశాల అధికారులకు అనుమతి



2



2

## జైలు నుంచి విడుదలైన సిసోదియా

- బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- 17 నెలల తర్వాత బయటకు
- ప్రజాస్వామ్యం శక్తితోనే బయటకు వచ్చా: మనీశ్

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 80 | రిటైల్ ₹ 102 |
| స్కిన్ ₹ 148 | స్కిన్ లెస్ ₹ 168 |

## వక్ఫ్ బిల్లుపై జేపీసీ

### విపక్షాల అభ్యంతరంతో కేంద్రం నిర్ణయం

### 21 మంది పేర్లను ప్రతిపాదించిన కేంద్రం

### జాబితాలో అసదుద్దీన్ ఒవైసీ పేరు

### లోక్ సభకు తెలిపిన మంత్రి కిరణ్ రిజుజు




**ఢిల్లీ:** కేంద్రం గురువారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన వక్ఫ్ (సవరణ) బిల్లు -2024లో వక్ఫ్ ఆస్తులను నియంత్రించే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు దఖలుపరిచే విధంగా సవరణలు ప్రతిపాదించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా మహిళలతోపాటు, ముస్లిమేతరులకు వక్ఫ్‌బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపాదనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లును విపక్ష ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో వెనక్కి తగ్గిన కేంద్రం బిల్లును మిగతా2లో...



# హైదరాబాద్‌లో ఆమ్‌జెన్ రీసెర్చ్ సెంటర్

**విశ్వంభర, హైదరాబాద్:** అమెరికాలోనే అతి పెద్ద బయో టెక్నాలజీ కంపెనీ ఆమ్‌జెన్ (AMGEN) తెలంగాణలో కార్యకలాపాలను విస్తరించనుంది. హైదరాబాద్ లో కొత్తగా రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగం ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. హైటెక్ సిటీలో ఆరు అంతస్తుల భవనంలో ఈ సెంటర్ ఉంటుంది. దాదాపు 3 వేల మందికి ఇక్కడ ఉద్యోగాలు లభిస్తాయి. ఈ ఏడాది చివరి త్రైమాసికం నుంచే కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు శాన్ ఫ్రాన్సిస్కోలోని ఆమ్‌జెన్ ఆర్ అండ్ డీ కేంద్రంలో కంపెనీ ఎండీ డాక్టర్ డేవిడ్ రీస్, నేషనల్ ఎగ్జిక్యూటివ్ మిస్టర్ సోమ్ చటోపా ధ్యాయతో సమావేశమయ్యారు. అనంతరం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలో పేరొందిన బయోటెక్ సంస్థ హైదరాబాద్‌ను తమ కంపెనీ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవటం గర్వించదగ్గ విషయమని అన్నారు. బయో టెక్నాలజీ రంగంలో హైదరాబాద్ ప్రాధాన్యం మరింత ఇనుమడిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి సాంకేతికతతో రోగులకు సేవ చేయాలని కంపెనీ ఎంచుకున్న లక్ష్యం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. 40 సంవత్సరాలుగా తమ కంపెనీ బయో టెక్నాలజీ రంగంలో అగ్రగామి సంస్థగా గుర్తింపు సాధించిందని కంపెనీ ఎండీ డాక్టర్ రీస్ అన్నారు. డేటా సైన్స్, అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలయికతో కొత్త ఆవిష్కరణలతో మరింత సేవలను అందించేందుకు ఈ సెంటర్ ఏర్పాటు అద్భుతమైన మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. భారత్ లో తమ కంపెనీ విస్తరణకు సోమ్ చటోపాధ్యాయను నేషనల్ ఎగ్జిక్యూటివ్ గా నియమించినట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఆమ్‌జెన్ ఇండియా హైదరాబాద్ ను కేంద్రంగా ఎంచుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఈ నిర్ణయం తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ పర్యావరణ వ్యవస్థను చాటిచెపుతుందన్నారు. కంపెనీ విస్తరణకు తగినంత మద్దతు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆమ్ జెన్ కంపెనీ ప్రపంచంలో వంద దేశాల్లో విస్తరించి ఉంది. దాదాపు 27 వేల మంది ఉద్యోగులున్నారు.



## తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకొండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అని పిలుపునిచ్చారు. 'ఇప్పటి వరకు మేం న్యూయార్క్, న్యూజెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్‌లో పర్యటించాం. ఇప్పుడు కాలిఫోర్నియాలో ఉన్నాం. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉంది. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం. టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు. కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదం ఉంది. మన దేశంలో రాష్ట్రాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాలేమీ లేవు. ఇప్పటినుంచి మన తెలంగాణ రాష్ట్రానికి అటువంటి ఒక లక్ష్య నినాదాన్ని ట్యాగ్ లైన్ గా పెట్టుకుందాం. ఇకపై మన రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్.. అని పిలుద్దాం..' అని సీఎం ప్రకటించారు. ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యునికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు స్వయంగా హైదరాబాద్‌ను సందర్శించాలని మంత్రి ఆహ్వానించారు. అక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు.

## అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఫ్యూచర్ స్టేట్ తెలంగాణకు పెట్టుబడులు లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ప్రస్తుతం కాలిఫోర్నియాలోని పలువురు గ్లోబల్ బిజినెస్ లీడర్లతో సమావేశాలు, చర్చలు జరుపుతున్నారు. అడోబ్ సీఈవోతో సమావేశంలో సీఎం తోపాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం తలపెట్టిన హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలపై శంతను నారాయణ్ ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు అంగీకరించారు. టెక్ విజనరీ శంతను నారాయణ్ ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## అలాంటి రూల్ పెట్టొద్దు

**దిల్లీ:** కళాశాల క్యాంపస్‌లో హిజాబ్, బుర్కా, నిఖాబ్ ధరించకూడదంటూ మహారాష్ట్ర లోని చెంబూరు కళాశాల జారీ చేసిన సర్క్యులర్‌పై సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం స్టే విధించింది. ముంబయిలోని ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠే కాలేజీకి చెందిన ముస్లిం విద్యార్థినులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. కళాశాల ఆదేశాలను సమర్థిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై పిటిషనర్లు సుప్రీంకోర్టు ఆశ్రయించారు. కళాశాల విధించిన షరతులపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, సంజయ్ కుమార్ ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇదేంటీ ? అలాంటి రూల్ పెట్టొద్దు.మతాన్ని బయటపెట్టకూడదా..? విద్యార్థుల మతం వెల్లడి కాకూడదనే నిబంధన విధించారంటూ కాలేజీ యాజమాన్యం వాదనలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రశ్నలు లేవనెత్తారు. విద్యార్థుల పేర్లు మతాన్ని బహిర్గతం చేయడం లేదా? నంబర్ల ద్వారా వారిని గుర్తించమని అడుగుతారా? అంటూ జస్టిస్ సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కాలేజీ తరఫు సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ ఇది ప్రైవేట్ సంస్థ అని చెప్పగా.. కాలేజీ ఎప్పటి నుంచి పని చేస్తుందని జస్టిస్ సంజయ్ కుమార్ ప్రశ్నించారు. 2008 నుంచి కళాశాల ఉనికిలో ఉందని చెప్పగా.. ఇన్నాళ్లు మీరు ఎందుకు సూచనలు చేయలేదు..? మతాన్ని అకస్మాత్తుగా గుర్తించారా? ఏళ్ల తర్వాత ఇలాంటి సూచనలు చేయడం దురదృష్టకరమని అన్నారు. తిలకం ధరించిన వారిని సైతం అనుమతించబోమని చెబుతారా? అంటూ జస్టిస్ ఖన్నా న్యాయవాదిని ప్రశ్నించారు.441 మంది ముస్లిం విద్యార్థులు కళాశాలకు సంతోషంగా హాజరవుతున్నారని.. కొందరు మాత్రమే అభ్యంతరం వ్యక్తం చేశారని తెలిపారు. అయితే, నచ్చిన దుస్తులు ధరించేందుకు విద్యార్థులకు అవకాశం ఉండాలని న్యాయస్థానం తెలిపింది. ఈ విషయంలో స్పందన చెప్పాలని ముంబయి ఎడ్యుకేషన్ సొసైటీని సుప్రీంకోర్టు కోరింది. ఈ మేరకు కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను నవంబర్కు వాయిదా వేసింది. స్టే ఆర్డర్‌ను ఎవరూ దుర్వినియోగం చేయొద్దని బెంచ్ స్పష్టం చేసింది. ఆర్డర్‌లో సవరణలు కోరేందుకు కళాశాల అధికారులకు అనుమతి ఇచ్చింది.

## సుంకిశాలపై ప్రభుత్వానిది అసత్య ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు మొదలుపెట్టారని, అయితే దానిని నల్గొండ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా హైదరాబాద్‌కు నీటికష్టాలు రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం సుంకిశాల ఉపయోగపడుతుందని చెప్పారు. కృష్ణానదికి నాలుగేండ్లు నీళ్లు రాకపోయినా ప్రాజెక్టుతో ఇబ్బందులు రావని స్పష్టం చేశారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, హైదరాబాద్‌లో నీటికోసం ఇబ్బందులు పడే పరిస్థితి లేదని చెప్పారు. హైదరాబాద్‌కు 50 ఏళ్లు తాగునీటి అవసరాలకు సరిపడేలా తమ హయాంలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సుంకిశాల ఘటనను ప్రభుత్వం ఎందుకు తొక్కిపెట్టిందని ప్రశ్నించారు. ఆగస్టు 2న ఉదయం 6 గంటలకు ఘటన జరిగితే ప్రభుత్వానికి సమాచారం లేదా? లేక విషయాన్ని కప్పిపెట్టారా? అని ప్రశ్నించారు. ఒకవేళ తెలియకపోతే ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. త్వరత్వరగా పనులు చేయాలని హడావిడిగా గేట్లు పెట్టడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్వహణ లోపంతో గోడ కూలిందన్నారు. పనులు చేస్తున్న ఏజెన్సీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనపై న్యాయ విచారణ చేయాలన్నారు. మున్సిపల్ శాఖను తనవద్దే పెట్టుకున్న సీఎం రేవంత్ ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. మేడిగడ్డలో ఏమైనా జరిగితే కేంద్రం స్పందిస్తుందని, ఇప్పుడు బీజేపీ ఏం చెబుతుందని కేటీఆర్ నిలదీశారు. మేడిగడ్డ ఘటనను ఎన్నికలున్నప్పటికీ తాము దాచిపెట్టలేదని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రజల కోట్లాది రూపాయల సంపద నీట మునిగిందన్నారు తమ ప్రభుత్వం సాగు, తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు కూడా వేగంగా చేశామన్నారు. సుంకిశాల ప్రమాదం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. పరిపాలన చేతగాక కేసీఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో శాంతి భద్రతలు సరిగ్గా లేవన్నారు. పేర్లు మార్చడమేనా మార్పు అంటే అని ఎద్దేవాచేశారు. వీళ్లకు సరుకు లేదు.. సబ్జెక్టు లేదని విమర్శించారు. బ్యారేజ్ గేట్లు ఎప్పుడు దించుతారో కూడా తెలియదని చెప్పారు. కాళేశ్వరం ఫెయిలైతే అన్ని రిజర్వాయర్లకు నీళ్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి చేతగాని తనంతోనే ఈ అంశాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. మంచి అయితే వారి ఖాతాలో, చెడు అయితే తమ ఖాతాలో వేస్తున్నారని విమర్శించారు. సుంకిశాలను త్వరలో బీఆర్ఎస్ బృందం సందర్శిస్తుందని చెప్పారు. రిటైర్డ్ ఇంజినీర్లను కూడా తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ నేతల చిల్లర ప్రచారానికి ప్రకృతే సమాధానం చెబుతుందని వెల్లడించారు.





# సెట్విన్ గొప్ప చరిత్ర ఉన్న సంస్థ

- సంస్థ బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుంది ...
- రాష్ట్ర మంత్రులు దామోదర్ రాజ నరసింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** నిరుద్యోగ యువతి యువకుల కోసం ఏర్పాటు చేసిన సెట్విన్ కు గొప్ప చరిత్ర ఉన్న సంస్థ అని, ఈ ప్రభుత్వరంగ సంస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సెట్విన్ సంస్థకు నూతనంగా చైర్మన్ గా నియమితులైన ఎన్. గిరిధర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహ తో కలిసి హాజరై ఆయనను అభినందించి ప్రసంగించారు.జంట నగరాల్లోని నిరుద్యోగులకు శిక్షణ అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 1978సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి గౌ. శ్రీ మర్రి చెన్నా రెడ్డి ఒక మంచి ఆశయంతో సెట్విన్ సంస్థను స్థాపించడం జరిగిందని అన్నారు. ఎంతో గొప్ప ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. జంట నగరాలతో పాటు సెట్విన్ మినీ బస్సు సర్వీసులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే కార్యక్రమానికి తమ వంతు సహకారం ఉంటుందని అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహ మాట్లాడుతూ సెట్విన్ సంస్థను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు సహకారం తప్పకుండ ఉంటుందని అన్నారు. నిరుద్యోగ యువత సెట్విన్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.సెట్విన్ చైర్మన్ ఎన్. గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ సేవలను విస్తరింప చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. త్వరలోనే జహీరాబాద్, తాండూర్, వికారాబాద్, సంగారెడ్డి ప్రాంతాలలో సెట్విన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సెట్విన్ సేవలను విస్తరింప చేయడానికి తన వంతు కృషి చేస్తానని గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. స్కిల్ ట్రైనింగ్ లో నిరుద్యోగ యువతకు తోడ్పాటును అందిస్తామని అన్నారు. తనకు చైర్మన్ గా అవకాశం కల్పినిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేకే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, నారాయణఖేడ్ ఎంఎస్ఏ పట్లోళ్ల సంజీవ కిష్ట రెడ్డి, ఎం ఎల్ సి బలమూరి వెంకట్, జహీరాబాద్ సీనియర్ కాంగ్రెస్ నేతలు ఉజ్వల్ రెడ్డి, ఫహీమ్, మహమ్మద్ అజహారుద్దీన్, సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్ బాబు, లీగల్ అడ్వైసర్ ఎంఏ మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకిశాలకు జరిగిన నష్టాన్ని గుత్తేదారే భరిస్తారు

(మొదటి పేజీ తరువాయి)

పోటెత్తడంతో, ఒక్కసారిగా పంప్‌హౌస్ రెండో సొరంగ మార్గం నుంచి ప్ర వాహం ఉద్ధృతంగా రావడంతో సుంకిశాల పంప్‌హౌస్‌లోని రక్షణ గోడ కూలింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సుంకిశాల ప్రాజెక్టును మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి మంత్రులు ఉత్తమ్, తుమ్మల పరిశీలించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.. డిండి ఎత్తిపోతల పథ కం కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సుంకిశాల పనులు బీఆర్ఎస్ హయంలో జరిగాయని, ఘటనపై సోషల్ మీడియా ద్వారానే ప్రభుత్వానికి తెలిసిందని తెలిపారు. సుంకిశాల ఘటన జరగ్గానే ప్రభుత్వం స్పందించిందని పేర్కొన్నారు. 'సుంకిశాలకు జరిగిన నష్టాన్ని గుత్తేదారు భరిస్తుందని ప్రభుత్వానికి, ప్రజలకు ఎలాంటి నష్టం లేదని అన్నారు. సుంకిశాల పనులు బీఆర్ఎస్ హయంలో జరిగాయని, ప్రభుత్వానికి ఘటనపై సోషల్ మీడియా ద్వారానే తెలిసిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై వాటర్ వర్క్స్ సిబ్బంది విచారణ చేస్తున్నారని, సీఎంతో చర్చించి తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై నిర్ణయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సుంకిశాల ప్రాజెక్టుపై విమర్శలు మంచిది కాదని, గోదావరి నదిపై ప్రాజెక్టుల నిర్మాణం జరిగినంత వేగంగా కృష్ణా నది ప్రాజెక్టు పనులు జరగలేదని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ఎందుకు ప్రారంభించారో కేసీఆర్, కేటీఆర్‌కే తెలియాలని ఆయన వ్యాఖ్యానించారు. సుంకిశాల పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఘటనపై ప్రభుత్వం విచారణ చేస్తోందని, ప్రాజెక్టుకు జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థ భరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు ఆదేశించారు.

### సుంకిశాల కర్త, కర్మ, క్రియ అన్నీ కేటీఆరే

**కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్**

**విశ్వంభర, హైదరాబాద్ :** సుంకిశాల ప్రాజెక్టు కర్త, కర్మ, క్రియ అన్నీ కేటీఆరే అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. కేటీఆర్ ఇష్టారీతిన విమర్శలు చేస్తున్నారని, బీఆర్ఎస్ హయాంలో ఏం చేసినా.. ఎవరూ అడిగేవారు లేరన్నట్లు వ్యవహరించారని మండిపడ్డారు.. కాళేశ్వరం కేసీఆర్, సుంకిశాల విషయంలో కేటీఆర్ బాధ్యత తీసుకోవాల్సిన అవసరముందన్నారు. 2021లో కేటీఆర్ సుంకిశాల ప్రాజెక్టుకు ఫౌండేషన్ వేశారని, మేఘ ఇంజినీరింగ్ కంపెనీ ఈ నిర్మాణ పనులు దక్కించుకున్నదని తెలిపారు. 2021లో పనులు మొదలుపెట్టి, 2023 ఏడాదికి పూర్తి చేశారని తెలిపారు. నాసిరకంగా ప్రాజెక్టులు కట్టడం వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లిందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు, పనులు, నిర్మాణ వ్యయం పెంపు వంటివి అన్నీ జరిగాయన్నారు. రూ.14 వందట కోట్లతో మొదలు పెట్టి, రూ.2 వేల కోట్లకు బడ్జెట్ పెంచారన్నారు. సుంకిశాలలో జరిగిన నష్టాన్ని ఆ కాంట్రాక్టర్‌తోనే భర్తీ చేయిస్తామని స్పష్టం చేశారు. పైసా వృథా చేయకూడదనేదే తమ సర్కార్ విధానమని వెల్లడించారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం 10 ఏళ్లలో కేసీఆర్ ఎందుకు విదేశాలకు వెళ్లలేదని ప్రశ్నించారు. కేసీఆర్ మీద నమ్మకం లేకే దావోస్ నుంచి పెట్టుబడులు రాలేదన్నారు. కానీ తమ ప్రభుత్వంలో పెట్టుబడిదారులకు నమ్మకం కల్గించేందుకే సీఎం రేవంత్, మంత్రి, అధికారులు అందరూ అమెరికా వెళ్లారన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టు ఒక్కటీ కట్టలేదని ఎంపీ బలరామ్ నాయక్ ఆరోపించారు. అన్నీ కమిషన్ల కోసమే చూసుకున్నారన్నారు. రేవంత్ పై నిందలు వేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తోందన్నారు.పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేశారన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏ ప్రాజెక్టూ సరిగా లేదని ధ్వజమెత్తారు.

# వక్ఫ్ బిల్లుపై జేపీసీ

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపేందుకు అంగీకరించింది.ఈ నేపథ్యంలో తాజాగా జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుకు 21 మంది లోక్‌సభ ఎంపీల పేర్లను కేంద్రం ప్రతిపాదించింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు శుక్రవారం లోక్‌సభకు తెలియజేశారు. జేపీసీ సభ్యులుగా జగదాంబికా పాల్, నిషికాంత్ దూబే, తేజస్వి సూర్య, అపరాజిత సారంగి, సంజయ్ జైస్వాల్, దిలీప్ సైకియా, అభిజిత్ గంగోపాధ్యాయ, డీకే అరుణ, గౌరవ్ గొగోయ్, ఇమ్రాన్ మసూద్, మొహమ్మద్ జావేద్, మౌలానా మొహిబుల్లా నాద్వి, కళ్యాణ్ బెనర్జీ, ఎ రాజా, లావు శ్రీ కృష్ణ దేవరాయలు, దిలేశ్వర్ కమైత్, అరవింద్ సావంత్, సురేష్ గోపీనాథ్, నరేష్ గణపత్, అరుణ్ భారతి, అసదుద్దీన్ ఒవైసీ పేర్లను ప్రతిపాదించారు. అదేవిధంగా జేపీసీ కోసం 10 మంది సభ్యుల పేర్లను సిఫార్సు చేయాలని రాజ్యసభను కోరారు. కేంద్ర ప్రతిపాదనను లోక్‌సభ ఆమోదించింది.



## జైలు నుంచి విడుదలైన సిసోదియా

**దిల్లీ:** మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా జైలు నుంచి విడుదలయ్యారు. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తిహాడ్ జైలు నుంచి 17 నెలల తర్వాత ఈ సాయంత్రం బయటకు వచ్చారు. దిల్లీ మద్యం విధానం కేసులో గతేడాది ఫిబ్రవరిలో సీబీఐ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సిసోదియా విడుదల సందర్భంగా భారీ సంఖ్యలో ఆయన మద్దతుదారులు జైలు వద్దకు చేరుకొని స్వాగతం పలికారు. వారిని ఉద్దేశిస్తూ ఆయన భావోద్వేగంతో కూడిన ప్రసంగం చేశారు.

**'సుప్రీం కోర్టు తీర్పు నియంతృత్వానికి చెంపపెట్టు'**

"జైల్లో ఉన్నంతకాలం దిల్లీ ప్రజలు, దేశంలోని చిన్నారులంతా మానసికంగా నాతోనే ఉన్నారు. సుప్రీం కోర్టు తీర్పు నియంతృత్వానికి చెంపపెట్టు. ఇందుకు సర్వోన్నత న్యాయస్థానానికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా. ప్రజల ప్రేమ, భగవంతుడి ఆశీస్సులు, సత్యానికి ఉన్న బలం.. వీటన్నింటికంటే ఎక్కువగా రాజ్యాంగం శక్తితో బయటకు వచ్చా. న్యాయ పోరాటాన్ని ఓ ముగింపునకు తీసుకువచ్చాం. ఈ క్రమంలో తోడుగా నిలిచిన మీ అందరికీ ధన్యవాదాలు" అని మనీశ్ సిసోదియా అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం శక్తితోనే తాను బయటకు వచ్చానన్న ఆయన.. ఇదే శక్తి దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విడుదలకు మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

**బెయిల్ పొందడం వారి హక్కు..**

సిసోదియాకు బెయిల్ మంజూరు చేసే క్రమంలో సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏ నిందితుడినీ కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరు. కేసు విచారణలో పురోగతి లేకపోయినా.. ఒక పరిమితి దాటిన తర్వాత ఆ వ్యక్తిని జైల్లో ఉంచడం సరికాదు. అలా కాదంటే ఆ వ్యక్తి హక్కులను హరించడమే అవుతుంది. బెయిల్ కు దరఖాస్తు చేసుకోవడం, ఉపశమనం పొందడం వారి హక్కు. 'బెయిల్ అనేది నియమం.. జైలు మినహాయింపు' అనే విషయాన్ని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు గ్రహించాల్సిన సమయం ఆసన్నమైంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## దోస్త్ స్పెషల్ ఫేజ్ సెల్ఫ్ రిపోర్టింగ్

**గడువు పొడిగింపు.. ఈ నెల 13 వరకు అవకాశం**




**విశ్వంభర, హైదరాబాద్:** దోస్త్ స్పెషల్ ఫేజ్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యార్థుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 13 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. వాస్తవానికి సెల్ఫ్ రిపోర్టింగ్ శుక్రవారంతో ముగియాల్సి ఉంది. కాగా మరో నాలుగు రోజులు గడువు పెంచుతూ ఉన్నత విద్యా మండలి అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

## పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మరో విద్యార్థి మృతి

**నెల రోజుల వ్యవధిలోనే తిరిగి విషాదం**
**ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు**

**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో మరో విద్యార్థి అనారోగ్యంతో మరణించాడు. గత నెలలో గణాదిత్య అనే విద్యార్థి మృతి చెందగా ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి ఆరోతరగతి విద్యార్థి అనిరుధ్, మొండి మోక్షిత్ హేమంత్ యాదవ్ , మరొకరు అస్వస్థతకు గురయ్యారు. అనిరుధ్‌ను మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మరో విద్యార్థి మొండి మోక్షిత్ ను నిజామాబాద్ కు తరలించారు. హేమంత్ యాదవ్ ను మెట్ పల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. గురుకుల పాఠశాలలో మొత్తం 542 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత నెల గణాదిత్య చనిపోయిన తరువాత చాలామంది విద్యార్థులు భయపడి పాఠశాలకు రావడం లేదని పాఠశాల ఇంఛార్జి తెలిపారు. ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటే 340 మందిలో ముగ్గురే ఎందుకు అస్వస్థులయ్యారు? అసలు ఏం జరిగిందనే విషయాలను తెలుసుకోవడానికి శుక్రవారం ఆర్డీఓ గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. కాగా గణాదిత్య చనిపోయిన తర్వాత అధికారులు వార్డెన్ ను సస్పెండ్ చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దని హెచ్చరించి 20 రోజులు గడవకముందే అనిరుధ్ మృతి చెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అనిరుధ్ పోస్టుమార్టం రిపోర్టు వస్తే గాని ఏం జరిగిందో తెలియదని అధికారులు అంటున్నారు.

# చెట్లతోనే కాలుష్య నివారణ

- మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత
- స్వచ్ఛదనం-పచ్చదనంలో అందరూ భాగస్వాములు కావాలి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపు



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మాసాబ్ ట్యాంక్‌లోని కాలేజీలో మొక్కలు నాటుతున్న మేయర్, ఎమ్మెల్యే తదితరులు

**విశ్వంభర, హైదరాబాద్:** చెట్లతోనే కాలుష్య నివారణ సాధ్యమని మహానగరంలో పట్టణీకరణ వేగంగా పెరుగుతుండటంతో దానికి తగినట్టుగానే పెరుగుతున్న కాలుష్యానికి మొక్కలు నాటడటంతో చెక్ పెట్టవచ్చునని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛదనం -పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాసబ్ ట్యాంక్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌లు పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతని సూచించారు. ఉద్యమ స్ఫూర్తితో కాలుష్య రహిత సమాజానికి పాటుపడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. స్వచ్ఛదనం- పచ్ఛదనం కార్యక్రమంలో ఈ ఐదు రోజులపాటు అన్ని వర్గాల ప్రజలకు పరిశుభ్రత, పచ్ఛదనంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించామని తెలిపారు. ముఖ్యంగా నగరంలో ఈ సంవత్సరం 50 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా.., ఇప్పటివరకు 13 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. సచ్ఛదనం-పచ్ఛదనం నిరంతరంగా కొనసాగించనున్నట్లు ఆమె వెల్లడించారు. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత సమాజానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, మొక్కలు నాటాలన్నారు.

గ్రేటర్‌లో ఫారెస్ట్ విస్తీర్ణం పెరిగినట్లు డిప్యూటీ మేయర్ వెల్లడించారు. నగరంలో ప్రజల ఆహ్లాదకరంగా పచ్ఛదనాన్ని పెంపొందించేందుకు జీహెచ్ఎంసీ చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్ర స్వచ్ఛ నగరంగా అభివృద్ధి చేసుకోవడం అందరి సామాజిక బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్‌లో 38 లోకేషన్స్ లలో ప్రజా ప్రతినిధులు సహకారంతో మొక్కలు నాటినట్లు, మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు, ఇప్పటి వరకు సుమారు అయిదున్నర లక్షల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వన మహోత్సవం సందర్భంగా 38 లోకేషన్స్ లో సుమారు 15 వేల మొక్కలు నాటినట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ (యూబీడీ) సునంద రాణి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తేనీటి విందులో మోదీ, రాహుల్ గాంధీ!

- పార్లమెంట్ ఆవరణలో ఆసక్తికర సన్నివేశం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారిన ఫొటో



**ఢిల్లీ:** పార్లమెంట్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రధాని మోదీ , ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు అధికార, విపక్ష నేతలు తేనీటి విందులో పాల్గొన్నారు. అనధికారికంగా జరిగిన భేటీలో మోదీ, రాహుల్ ఒకరినొకరు నవ్వుతూ పలకరించుకున్నారు. సభలో ఉప్పునిప్పూగా ఉండే ఈ అగ్రనేతలిద్దరూ ఇలా ఒకేచోట కూర్చున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఆగస్టు 12 వరకు జరగాల్సి ఉండగా.. ఉభయ సభలూ శుక్రవారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. అనంతరం పార్లమెంట్ ఆవరణలో సాయంత్రం 4 గంటల సమయంలో ఈ భేటీ జరిగింది. మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోఫాలో కూర్చోగా.. పక్కనే కుర్చీలో రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రామ్మోహన్ నాయుడు, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులు వరుసగా కూర్చున్నారు. ఎదురుగా మరో సీట్లో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా ఉన్నారు. ఈ భేటీకి సంబంధించి ఇతర వివరాలేవీ బయటకు రాలేదు. ఇటీవల బంగ్లాదేశ్‌లో అల్లకల్లోల పరిస్థితులపై అఖిలపక్ష భేటీలోనూ దాదాపు ఇటువంటి దృశ్యమే ఆవిష్కృతమైంది.





# సైనిక్ స్కూల్‌ను బీఆర్ఎస్ పట్టించుకోలేదు

## కేంద్రం మంజూరి చేసినా నిర్లక్ష్యం వహించిన కేసీఆర్ ప్రభుత్వం

### లోక్‌సభలో పాలమూరు ఎంపీ డీకే అరుణ

**విశ్వంభర, హైదరాబాద్ :** పాలమూరు జిల్లాకు గతంలో సైనిక్ స్కూల్ ను కేంద్రం మంజూరు చేసినప్పటికీ బీఆర్ఎస్ పట్టించుకోలేదని మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. గత ప్రభుత్వం భూసేకరణ చేయకుండా నిర్లక్ష్యం చేసిందని డీకే అరుణ ఘాటు విమర్శలు చేశారు. ఎంపీగా గెలిచిన డీకే అరుణ తొలిసారి పార్లమెంట్ లో తన గళాన్ని వినిపించారు. ఈనేపథ్యంలో జీరో హవర్‌లో నారాయణపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు ఆవశ్యకతను కేంద్ర దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో సైనిక్ స్కూల్ లేదని, ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలోని ఎక్లాస్ పూర్ వద్ద 50 ఎకరాల్లో సైనిక్ స్కూల్ ఏర్పాటుకు సర్వే కూడా చేపట్టారని, ఆ ప్రక్రియ కూడా పూర్తయిందని డీకే అరుణ వివరించారు. కేంద్రం చొరవ చూపి వీలైనంత త్వరగా సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ని డీకే అరుణ కోరారు.





# మున్సిపాలిటీలో అవినీతి తిమింగలం

**విశ్వంభర, నిజామాబాద్ :** మున్సిపల్ కార్యాలయంలో బయటపడ్డ అవినీతి తిమింగలం...ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై రెవిన్యూ ఆఫీసర్ నరేందర్ ఇంట్లో శుక్రవారం ఉదయం నుంచి ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. భారీగా నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. నరేందర్ ఇంటితో పాటు కార్యాలయం, బంధువుల ఇంట్లో కూడా అధికారుల తనిఖీలు నిర్వహించారు. .ఏసీబీ సోదాల్లో రూ. 2,93,81,000 నగదు పట్టుబడింది. .నరేందర్ బ్యాంకు ఖాతాల్లో రూ. 1,10,00000, 6 కేజీల బంగారు ఆభరణాలు, 17 స్థిరాస్తుల గుర్తించారు. .మొత్తం 6 కోట్ల 7 లక్షల విలువగల ఆస్తులున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

# బల్దియాలో త్వరలో అంతర్గత బదిలీలు

- ముగిసిన కమిటీ కసరత్తు
- కమిషనర్‌కు నివేదిక త్వరలోనే తుది నిర్ణయం



**విశ్వంభర, హైదరాబాద్ :** మహానగరంలోని కోటిన్నర మంది జనాభాకు అత్యవసరమైన సేవలందించే జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీల కసరత్తు ముగిసింది. వేలాది మంది కార్పొరేషన్‌కు చెందిన పర్మినెంట్ ఉద్యోగులతోపాటు ఔట్ సోర్స్ ప్రాతిపదికన పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల రేష్నలైజేషన్ ప్రక్రియను చేపట్టేందుకు నలుగురు అదనపు కమిషనర్లతో నియమించిన కమిటీ ఎట్టకేలకు కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కార్పొరేషన్‌కు చెందిన సుమారు మూడున్నర వేల మందిలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, సూపరింటెండెంట్లు వంటి నాలుగు క్యాటగిరీలకు సంబంధించిన ఉద్యోగుల్లో సర్కిల్, జోనల్ స్థాయిలతోపాటు ప్రధాన కార్యాలయంలోనూ ఒకే విభాగంలో మూడేళ్ల కాలం దాటిన ఉద్యోగుల వివరాలతో బదిలీ లిస్టును సిద్ధం చేసి కమిషనర్ ఆమ్రపాలికి సమర్పించినట్లు సమాచారం. ఈ బదిలీలకు సంబంధించి ఆమె త్వరలోనే కీలకమైన నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ బదిలీల్లో భాగంగా 230 మంది సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్ కమ్ ట్రాన్స్ ఫర్లు పొందనున్నట్లు సమాచారం.

**ఔట్ సోర్స్ ఆపరేటర్లకు సైతం**

జీహెచ్ఎంసీలోని సర్కిల్, జోన్, ప్రధాన కార్యాలయంతో పాటు వార్డు ఆఫీసుల్లో ఔట్ సోర్స్ ప్రాతిపదికన పని చేస్తున్న సుమారు రెండున్నర వేల మంది కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా ఈ బదిలీల్లో భాగంగానే స్థానచలనం కల్గించేందుకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. కానీ ఉన్నతమైన చదువులు చదివి కూడా ఎక్కడా ఉపాధి లభించక జీహెచ్ఎంసీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం చేస్తున్న వీరిని కూడా జోనల్ స్థాయిలో బదిలీలు చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. వీరిలో చాలా మంది హెల్త్, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాలతోపాటు టౌన్ ప్లానింగ్ సెక్షన్లలో ఏళ్లుగా పని చేస్తూ పలు అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో కంప్యూటర్ ఆపరేటర్లను కూడా బదిలీ చేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం. కానీ చాలీ చాలని జీతాలకు పని చేస్తున్న తమను ఒక జోన్ నుంచి మరో జోన్‌కు బదిలీ చేస్తే తామెలా విధులు నిర్వహిస్తామని కంప్యూటర్ ఆపరేటర్లు వాపోతున్నారు. ఈ అంతర్గత బదిలీల నుంచి తమకు మినహాయింపునివ్వాలని కంప్యూటర్ ఆపరేటర్లు కోరుతున్నారు.

**వారి బదిలీలు కమిషనరే చేస్తారు**


జీహెచ్ఎంసీలో అంతర్గత బదిలీల కోసం నియమించిన కమిటీ జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, సూపరింటెండెంట్లతో పాటు 30 సర్కిళ్లలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ల బదిలీల జాబితాను కూడా సిద్ధం చేశారు. కానీ డిప్యూటీ కమిషనర్ల బదిలీలు మినహా మిగిలిన ప్రక్రియ పూర్తి చేయాలని, డిప్యూటీ కమిషనర్ల బదిలీలకు సంబంధించిన ప్రక్రియను తానే పూర్తి చేయనున్నట్లు కమిషనర్ సూచించినట్లు సమాచారం. ముందు సిబ్బంది అంతర్గత బదిలీల ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే డిప్యూటీ కమిషనర్లను బదిలీ చేయనున్నట్లు సమాచారం.



# బయో ఫ్యూయెల్‌కు కరువైన ప్రోత్సాహం

**○ ఆగస్టు 10న... ప్రపంచ జీవ ఇంధన దినోత్సవం**

జీవ ఇంధన వాడకం మానవునికి కొత్తేమి కాదు. మానవుడు మొదట నిప్పును సృష్టించిన తరువాత ఎండిన కర్రపుల్లలు, చెట్లకాండాలు, ఆకులను నిప్పు పుట్టించే ఇంధనంగా వాడటం ప్రారంభించాడు. తరువాత జంతు, మొక్కల నుండి తీసిన నూనెలను కూడా ఇంధనంగా వాడేవాడు. ఆ తరువాత ఇళ్ళలో వంటలకు, ఇతరత్రా పనులకు కర్రలను, కర్రలను కాల్చగా ఏర్పడే బొగ్గులను ఇంధనంగా వాడటం అలవాటు చేసుకున్నాడు. ప్రస్తుతం విచ్చలవిడిగా అవసరానికి మించి వాడుతున్న నేలబొగ్గు (భూమి గర్భం నుండి త్రవ్వితీసిన బొగ్గు), ముడిపెట్రోలియం నుండి ఉత్పత్తి గావించే ఖనిజ నూనెలు, వాయువులు, పెట్రోలియం బావుల నుండి ప్రారంభంలో వెలువడు సహజ వాయువు వంటివి అన్నీ శిలాజ ఇంధనాలు. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమిమీద ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో భారీ పరిమాణంలో భూమి మీది జీవరాశి అంతమై, క్రమేణా భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడ్డాయి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించడానికి సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాటి నిల్వలు తగ్గుతాయి కానీపెరగవు. ఇప్పటికే 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిళ్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవీ కదలవు. మళ్లీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడవలసి వుంటుంది. ఉత్పత్తి అయిన వస్తువులు వేగంగా వినియోగ ప్రాంతాలకు చేరనిచో అభివృద్ధి కుంటుపడుతుంది. జన జీవనం అస్తవస్తం అవుతుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి, 10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం (IC Engine) యొక్క కార్బ్యేరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450 డిగ్రీల సెల్సియస్ వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడును. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడును.




భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని

భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టియందు ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం:పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోపా) గింజలనుండి తీసే నూనె. బయో డీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. తత్ఫలితంగా బెంగుళూరు పరిసర ప్రాంతాలతో ముందుగా ట్రాక్టర్లను బయో డీజిల్ తో నడపడం జరిగింది. యూరోపియన్ దేశాలలో ఉత్పత్తి అయిన డీజిల్ లో 2శాతం బయో డీజిల్ ను మిశ్రమిస్తున్నారు. గత భారత ప్రభుత్వం కూడా మొత్తం రవాణా ఇంధనాలుగా జీవ ఇంధనాలను 20శాతానికి పెంచాలనే లక్ష్య నిర్దేశం చేసింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కర లేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్లకిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. ఈ క్రమంలోనే 2006 08 మధ్య కాలంలో రాష్ట్రంలో జీల ఇంధన మొక్కల పెంపకాన్ని చేపట్టారు. లక్ష ఎకరాలలో జీవ ఇంధన మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం రైతులు, స్వచ్ఛంద సంఘాలను, పంచాయతీలను ప్రోత్సహించింది. ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు సాయం చేయాలని నిర్ణయించారు. భారత ప్రభుత్వం కానుగ 6 రూపాయల మద్దతు ధరలు నిర్ణయించింది. బయోడీజిల్ కొనుగోలు రేటును 25 రూపాయలు నిర్ణయించింది. పంట వేసుకోవడానికి 40% బ్యాంకు ద్వారా, 60% సబ్సిడీ అందించే చర్యలు చేపట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకం, ఇందిర ప్రభ వాటర్ షెడ్ పథకం ద్వారా చేపట్టు ఎస్సీ, ఎస్టీ అసైన్ భూములు 100% రాయితీ కల్పిస్తామని ప్రకటించింది. స్వశక్తి మహిళా సంఘాలచే ప్రభుత్వ బీడు భూములలో చేపట్టుటకు 100% రాయితీ అందిస్తామంది. ప్రతి వంద రైతులకు అనుసంధాన కార్యకర్తలకు నెలకు 1500 చొప్పున ఏర్పాటు చేసే నిర్ణయం గైకొంది. ప్రతి మండలానికి ప్లాంటేషన్ మేనేజర్, బయోడీజిల్ కొరకు 4వేల రూపాయలు కేటాయించారు. ప్రభుత్వ భూములలో కానుగ మొక్కలను పెంచడం ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ సంఘాలకు, పంచాయితీ లకు, అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీలకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. బ్లాక్ అండ్ అవెన్యూ ప్లాంటేషన్ పై రాష్ట్రంలో కోట్లు ఖర్చు చేశారు. 200708 లో కొనసాగించారు. ఇందిర ప్రభ అటకెక్కగా, సబ్సిడీలు మటు మాయమయ్యాయి. ప్రభుత్వం ప్రకటించినట్లు పంటకు మద్దతు ధర చెల్లించడం కానీ కొనుగోలు చేసిన దాఖలాలు లేనేలేవు. కోట్లాది రూపాయల అంచనాలతో ప్రణాళికా బద్ధంగా మొక్కల పెంపుదలకు కార్యాచరణ రూపొందించి అట్టహాసంగా పెంపకాలను చేపట్టినా, అది ఆచరణ శూన్యమే అయింది.



**- రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# కార్మిక ఉద్యమ కెరటం భారత రత్న వీవీ గిరి

**○ నేడు ఆయన జయంతి**

భారత దేశానికి 4వ రాష్ట్రపతిగా, కార్మిక ఉద్యమానికి విశేషమైన సేవలు చేసి వి.వి.గిరిగా ప్రసిద్ధుడైన వరాహగిరి వేంకటగిరి (ఆగస్టు 10, 1894 జూన్ 23, 1980) గారు అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని గంజాం జిల్లాకు చెందిన బెర్హంపూర్ పట్టణంలోని ఒక తెలుగు నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి వరాహగిరి వెంకట జోగయ్య ప్రసిద్ధ న్యాయవాది. 1913లో ఆయన యూనివర్సిటీ కళాశాల డబ్లిన్ లో న్యాయ శాస్త్రం అభ్యసించడానికి వెళ్లారు. అయితే ఐర్లండ్ లో సీన్‌ఫెన్ ఉద్యమంలో పాల్గొని దేశ బహిష్కరణకు గురయ్యారు. ఆ ఉద్యమ కాలంలోనే ఆయనకు ఈమొన్ డి వలేరా, మైఖెల్ కోలిన్స్, పాట్రిక్ పియర్సె, డెస్మండ్ ఫిట్జెరాల్డ్, ఈయోన్ మెక్‌నీల్, జేమ్స్ కాన్నలీ తదితరులతో సన్నిహితం ఏర్పడింది. 1914 లో బ్రిటన్ లో గాంధీజిని కలిశారు. వారి సలహామేరకు బ్రిటన్ రెడ్ క్రాస్ లో చేరారు. అక్కడే భారతీయ విద్యార్థి సంఘాన్ని స్థాపించి కార్యదర్శిగా పనిచేశారు.1916 భారత దేశం వచ్చి న్యాయవాద వృత్తి చేపట్టారు. భారతీయ కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పరుచుకున్నారు. అనిబీసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. జాతీయ కాంగ్రెసులో చేరారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గోని ఏడాది కారాగారశిక్ష అనుభవించారు. తర్వాత క్రియాశీలంగా కార్మిక ఉద్యమంలో పాల్గొని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్యకు ప్రధాన కార్యదర్శి, ఆ తరువాత అధ్యక్షులుగా పని చేశారు. రెండుసార్లు అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కూడా పనిచేశారు.




గిరి 1934లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ లో సభ్యుడయ్యాడు. 1936లో మద్రాసు రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గిరి కాంగ్రెస్ అభ్యర్థిగా బొబ్బిలి రాజా పై పోటీ చేసి గెలిచాడు. 1937లో మద్రాసు ప్రోవిన్స్ లో రాజాజీ నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రేసు ప్రభుత్వంలో కార్మిక, పరిశ్రమల మంత్రిగా పనిచేశాడు. 1942లో కాంగ్రేసు ప్రభుత్వాలన్నీ రాజీనామా చేసినప్పుడు, గిరి తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కార్మిక ఉద్యమాన్ని నడిపి జైలుకు వెళ్ళాడు. ఈయనను రాజమండ్రి జైలులో ఖైదీగా ఉంచారు.193437 వరకు భారత శాసనసభ్యునిగా ఎంపికయ్యారు.1927 లో జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశానికి హాజరయ్యారు. అనంతరం బొబ్బిలి రాజా వారిపై పోటీ చేసి గెలుపొందారు.1937 రాజాజీ మంత్రివర్గంలో చేరారు.

1942లో కాంగ్రెస్ ప్రభుత్వాలన్నీ రాజీనామా చేసినప్పుడు, గిరి తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కార్మిక ఉద్యమాన్ని నడిపి జైలుకు వెళ్ళారు. 1946లో తిరిగి ప్రకాశం పంతులు ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా పనిచేశారు. అనంతరం శ్రీలంక లో భారత్ హైకమీషనర్ గా ఉన్నారు. 195760లో ఉత్తర ప్రదేశ్, 196065 కేరళ,196567 మైసూర్ రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు. 1967 భారత ఉపరాష్ట్రపతిగా ఎంపికయ్యారు. నాటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 1969 మే 3 వతేదిన మరణించడంతో 1969 ఆగస్టు 24న భారత నాలుగో రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు. పలు విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న గిరిని 'భారతరత్న' వరించింది.

1969 లో రాష్ట్రపతి ఎన్నిక లో పార్టీ అధికారిక అభ్యర్థిగా పోటీ చేసిన నీలం సంజీవరెడ్డికి వ్యతిరేకంగా ఆత్మ ప్రబోధానుసారం ఓటు వెయ్యమని ఇందిరా గాంధీ తన పార్టీ వారిని ఆదేశించింది. ఫలితంగా ప్రతిపక్ష మద్దతు కూడా గల వి.వి.గిరి, సంజీవరెడ్డి ని ఓడించి రాష్ట్రపతి అయ్యారు.

248 1974 న వి.వి.గిరి గారు రాష్ట్రపతిగా పదవి విరమణ సందర్భంగా ఒక ప్రత్యేక తపాల బిళ్ళను విడుదల చేశారు.

# బీసీల పక్షపాతి శివశంకర్

**○ ఆగస్టు 10న ఆయన జయంతి**

తామే వెనకబడిన తరగతుల వారికి నాయకులమని, తోటి వారి అభ్యున్నతే తమ ఏకైక లక్ష్యమని చాలా మంది వకాల్తా పుచ్చుకుని, ఎన్నికల్లో, లేదా పదవులు పొందడంలో బీసీ కార్డులను ఉపయోగించుకుని, తీరా పదవులు పొందాక, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణం. కానీ అలాకాక తాము పొందిన పదవుల ద్వారా బీసీల అభివృద్ధికి పాటుపడిన వారు బహు అరుదుగా కనిపిస్తారు. అలా బీసీల అభివృద్ధికి తోడ్పడిన వాళ్లలో పుంజాల శివ శంకర్ మొదటి వరుసలో ఉంటారు.

కింది స్థాయి నుంచి ఎదిగి నాయకులూ అయ్యే వారు చాల మంది ఉంటారు, కాని ఒక బలహీన వర్గాల కుటుంబంలో అది కూడా ఒక పేద కుటుంబంలో పుట్టి దేశ రాజకీయలను ఒక దశాబ్దం పాటు శాసించే స్థాయికి ఎదగటం, అది కూడా ఇందిరా గాంధీ లాంటి శక్తిశాలికికుడి భుజంలాగా ఉండటం, ఇందిర, రాజీవ్ అధికార నివాసాలకు పక్కనే ఎప్పటికీ ఇల్లు ఉండటం ఒక్క శివశంకర్ కే సాధ్యమైంది. బలహీన వర్గాల నాయకుడిగా పేరున్న శివశంకర్ తెలంగాణ మున్నూరు కాపు కులానికి చెందిన నాయకుడు.

1929, ఆగస్టు 10న హైదరాబాద్ సమీపంలోని మామిడి పల్లిలో ఆయన జన్మించారు. శివశంకర్ మెట్రిక్యులేషన్ వరకు హైదరాబాద్ లో చదివి ఆ తర్వాత చదువుకు ఇంట్లో ఇబ్బందులు ఏర్పడటంతో తన అన్నతో కలిసి పంజాబ్ కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ కొన్ని సందర్భాలలో తిండిలేక మజ్జిగ తాగుతూ, పల్లీలు తిని చదువుకుంటూ అమృత్ సర్ హిందూ కాలేజీ నుండి బీ.ఏ.పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎల్ ఎల్ బి పూర్తి చేశారు.



న్యాయ శాస్త్రాల్లో, ఇంగ్లీష్ భాషలో మంచి పట్టుగల శివశంకర్ హైదరాబాద్ లో న్యాయవాదిగా ప్రాక్టీసును ప్రారంభించి పేదల బడుగు బలహీన వర్గాల కేసులను ఉచితంగా కోర్టులలో వాదించేవారు. మంచి సమర్థుడైన న్యాయవాదిగా పేరు తెచ్చుకొని సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్ కార్యదర్శిగా, 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు.

1972లో ఆంధ్రప్రదేశ్ లో వెనుకబడిన తరగతులకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత అనంతరామన్ కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేస్తూ బీసీ కులాలకు 30% రిజర్వేషన్లు ప్రతిపాదించింది. దీనిపై ఏపీ హైకోర్టులో 110 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి, అప్పుడు బీసీలకు 30% రిజర్వేషన్లు చెల్లవని హైకోర్టు తీర్పునివ్వగా... నాటి జేఏసీ తరపున శివశంకర్ సొంత ఖర్చుతో 18 నెలలు ఢిల్లీలో ఉండి సుప్రీం కోర్టులో బీసీ రిజర్వేషన్లను గెలిపించుకొని తిరిగి వచ్చారు.

1974 నాటికి చిన్న వయసులోనే ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జిస్థాయికి ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ లోని న్యాయ వ్యవస్థలో ఒకే కులానికి చెందినవారు ఆధిపత్యం వహిస్తూ సీనియారిటి ప్యానల్ లో మిగతా వారిని పరిగణన లోకి తీసుకోక పోవడం గమనించి తను ప్రభుత్వ న్యాయమూర్తి పరిధిలో పేదల బడుగు బలహీన వర్గాల తరపున పోరాటం చేయలేక పోతున్నానని ఏకంగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. చదువు కోవడమంటే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం కాదని, వ్యక్తిగత ఎదుగుదలే ముఖ్యంగా భావించే నేటి తరానికి సమాజం కోసం హై కోర్ట్ జడ్జి స్థాయి ఉద్యోగాన్ని వదులుకోవడం ఆయన చిత్తశుద్ధికి, త్యాగ నిరతికి నిదర్శనం.

హై కోర్టు జడ్జిగా రాజీనామా చేసి హైకోర్టు, సుప్రీం కోర్టులల్లో న్యాయ వాదిగా ప్రాక్టీసు చేస్తూ అన్ని వర్గాలకి సామాజిక న్యాయం విషయములో అధ్యయనం చేస్తుండే వారు.

ఆయన మొదటి సారి గా 1977 లో ఇందిరాగాంధీని కలుసుకున్నా తమ అపార న్యాయ విజ్ఞానంతో ఆమె మనసు చూరగొనడమే కాకుండా అతితక్కువ కాలంలో ఆమెకు అత్యంత సన్నిహితుడయ్యారు.

197475లో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. 1977 లో ఎమర్జీన్సీ తర్వాత ఆయన ఇందిరాగాంధీకి న్యాయవాదిగా కూడా ఉన్నారు. 1979లో సికింద్రాబాద్ నుంచి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆ నియోజకవర్గం నుంచి 1980 లో రెండో సారి ఎన్నికయ్యారు. 1981లో ఇందిరాగాంధి మంత్రివర్గంలో చాలా కీలకమయిన నాయకుడిగా ఉన్నారు.

1985లో శివశంకర్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1993 దాకా రాజ్యసభలోనే కొనసాగారు. ఈ మధ్యలో ఆయన విదేశీ వ్యవహారాల శాఖ, మానవ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. కొద్ది రోజులు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ గా కూడా పనిచేశారు. 1988 89 లో రాజ్యసభ కాంగ్రెస్ పక్ష నాయకుడి గా ఉన్నారు. తర్వాత సిక్కిం, కేరళ వర్నర్ గా నియమితులయ్యారు. 1998లో తెనాలి నుంచి లోక్ సభ కు పోటీచేసి గెలుపొందారు. ప్రధాని నివాసానికి దగ్గరలో 5, సఫ్దర్ జంగ్ లేన్ బంగళాను ఆయన కేటాయించారు.

ఇంధన శాఖను నిర్వహించిన సమయంలో, రాజకీయ జోక్యం లేకుండా, పెట్రోలు బంకులు, గ్యాస్ ఏజెన్సీల కేటాయింపులను క్రమబద్ధీ కరించారు. మానవ వనరుల శాఖ మంత్రిగా కేంద్రీయ విద్యాలయాల విస్తరణకు కృషి చేశారు. ఇందిరాగాంధి మరణానంతరం రాజీవ్ గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడానికి ముఖ్య పాత్ర పోషించిన శివశంకర్ మెదక్ (గతములో ఇందిరాగాంధి గెలిచిన స్థానం) నుండి లోక్ సభకు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోవడముతో 1985 నుండి 1993 వరకు గుజరాత్ నుండి రాజ్యసభకు ఎన్నికై కేంద్ర వాణిజ్య శాఖామంత్రిగా 1985 లో ,1986లో విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖనూ నిర్వహించారు.

ఏ సభలో సభ్యత్వం లేని రోజులలో కూడా ఆయనకు ప్రధాని నివాసంతో విడదీయని సంబంధాలు ఉండేవి. అందుకే సఫ్దర్ జంగ్ లేన్ నివాసం చాలాకాలం కొనసాగింది. ఇందిర, రాజీవ్ కాలంలో అన్ని కీలకమయిన పార్టీ, ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన పాత్ర వుండేది.

రాజీవ్ హయాంలో చాలా కీలకమయిన నిర్ణయాలెన్నో తీసుకున్నా సరే ఆయన పనితీరు ఎపుడూ వివాదాస్పదం కాలేదు. ఆయన కూడా ఎపుడూ వార్తలక్కే ప్రయత్నం చేయలేదు. రాజీవ్ దూతగా ఆయన నేపాల్, బంగ్లాదేశ్ లను సందర్శించి ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలు నెలకొల్పడంలో ప్రధానికి బాగా సహకరించే వారని ఆయన మిత్రులు చెబుతారు. పంజాబ్ ఒప్పందంలో కూడా శివశంకర్ కీలక ప్రాత పోషించారని చెబుతారు. కాంగ్రెస్ లో సరైన గుర్తింపు లేక, స్వార్థ రాజకీయాలకు తట్టుకోలేక

2004 లో ఆయన కాంగ్రెస్ ను వదిలేశారు. 2017 ఫిబ్రవరి 27న ఆయన మరణించారు.

శివశంకర్ జీవితాంతం అంబేద్కర్ , పూలే ఆదర్శంగా, ఆ మహా నాయకుల ఆలోచనల మేరకు పని చేశారు. న్యాయవ్యవస్థ సహ అన్నీ రంగాల్లో దళితులకు ప్రాతినిధ్యం ఉండాలని శివశంకర్ కోరుకునే వారు.

ఇందిరా గాంధీ పక్షాన కేసులను వాదించి, ఆమెకు అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. రాజీవ్ గాంధీ హాయంలో ప్రభుత్వంలో ప్రధాని తర్వాత చాలా పలుకుబడి ఉన్న వ్యక్తి శివశంకరే.

నేడు, పి శివ శంకర్ ప్రధానమంత్రి తర్వాత దేశంలో అత్యంత శక్తివంతమైన వ్యక్తి అని

1986 నాటికి ఇండియా టుడే పత్రిక రాసిన కథనాన్ని బట్టి ఆయన బట్టి పలుకుబడి ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు

# ఆనాటి బ్రిటీష్ వాళ్లీగే బీజేపీ ప్రభుత్వం పరిపాలిస్తుంది

**- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**విశ్వంభర, హైదరాబాద్ :** క్విట్ ఇండియా మూమెంట్ డే సందర్భంగా గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ వలస పాలన నుండి స్వాతంత్ర్యం కోసం భారతదేశం చేసిన పోరాటంలో, ఆగష్టు 8, 1942 న మహాత్మా గాంధీ ప్రారంభించిన ముఖ్యమైన శాసన ఉల్లంగన ఉద్యమం క్విట్ ఇండియా అన్నారు. నాడు క్విట్ ఇండియా అనే పిలుపు స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన మలుపుకు నాంది పలికిందన్నారు. నాడు బ్రిటిష్ పాలకుల విముక్తి కోసం మహాత్మాగాంధీ గారు క్విట్ ఇండియా ఉద్యమం చేస్తే..నేడు రాహుల్ గాంధీ గారు బీజేపీ ముక్త భారత్ కోసం భారత్ జోడో న్యాయ యాత్ర చేస్తున్నారు అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ వ్యతిరేకుల...ఇవ్వాల దేశాన్ని పాలిస్తున్నారని అన్నారు. బ్రిటిష్ వాళ్ళ మాదిరిగానే ఈనాటి పాలకులు కులం,మతం, వర్గాల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. అందరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని రాహుల్ గాంధీ ఆలోచన అన్నారు. అందుకే భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ చేశారు అని తెలిపారు. గాంధీ కలలు కన్న రాజ్యం కోసం రాహుల్ గాంధీ.. అహింసా మార్గంలో పయనిస్తున్నారన్నారు. ఆస్తులు ప్రజల కోసం ధారాదత్తం చేసిన చరిత్ర రాహుల్ గాంధీ కుటుంబం ది అన్నారు. అలాంటి గాంధీ కుటుంబం పై కుట్రలు చేస్తుంది మోడీ ప్రభుత్వం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ చిత్రపటం.. కరెన్సీ నోటు మీద లేకుండా చేసే కుట్ర కూడా చేసింది బీజేపీ అని ఆరోపించారు. మోడీ పాలన అంత మొందించడానికి రాహుల్ గాంధీ కృషి చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీ కుటుంబం రాజకీయంగా లేకుండా చేయాలని చూశారు.. కానీ ప్రజలు ప్రతిపక్ష నాయకుడి గా కూర్చోబెట్టారన్నారు. ఇవాళ ప్రతిపక్ష నాయకుడిగా కూర్చోపెట్టి న ప్రజలు.. వచ్చే ఎన్నికలలో ప్రధానిగా కుర్చోపెట్టబోతున్నారని జగ్గారెడ్డి అన్నారు.

# రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

## కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి :** గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందొద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి సమీకృత కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాల రైతులతో సమావేశం నిర్వహించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పట్ల సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని ఇదివరకే ఆదేశించారని తెలిపారు. రైతుల అభీష్టం మేరకే భూసేకరణ చేయడం జరుగుతుందని అన్నారు. రైతుల యొక్క సలహాలు, సూచనలు తెలుసుకోవడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామని, రైతుల విజ్ఞాపనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా 3 మండలాల పరిధిలోని 13 గ్రామాల రైతులు భూములను కోల్పోతున్నారని అన్నారు. 350 ఎకరాలు 35 కిలో మీటర్ల దూరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు మాత్రమే సేకరిస్తున్నామని కానీ కొన్ని చోట్ల పార్కింగ్ తదితర అవసరాల కోసం 170 నుండి 250 మీటర్ల వెడల్పులో కొందరు రైతులు భూములు కోల్పోతున్నారని తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి ప్రభుత్వ భూములు ఎక్కువ ఉన్న చోటుకు వాటిని మార్చి తక్కువ మొత్తంలో భూములు సేకరించే విధంగా చర్యలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నేషనల్ హైవే అధికారులు, మూడు మండలాల రైతులు పాల్గొన్నారు.





# సెల్ ఫోన్ టవర్ నిర్మాణాన్ని నిలిపి వేయాలి

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ పరిధిలో మోడీ ఎమరాల్డ్ పార్క్ వద్ద సెల్ టవర్ నిర్మాణం జరుగుతుండగా చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు సెల్ టవర్ నిర్మిస్తున్న వారిని అడ్డుకున్నారు. దీని ద్వారా ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉండదని, మాకు పోచారం మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి అనుమతి పత్రం ఇచ్చారని, ఆయన ఇచ్చిన అనుమతి పత్రాన్ని నిర్మాణదారులు ప్రజలకు చూపించారు. దీనిపై చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు భయపడుతూ పోచారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. దీనిపై ప్రజలు స్పందిస్తూ ఇప్పటికే ఈ ఏరియాలో సెల్ టవర్లు ఎక్కువ కావడంతో వాటి ద్వారా వచ్చే రేడియేషన్స్ ఎక్కువగా వ్యాపిస్తుండటంతో ప్రజలు అనేక రోగాలకు గురై ఇబ్బంది పడుతున్నారని ప్రజలు వాపోయారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, ఇలాంటి టవర్లను నిలిపివేసి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చూడాలని ప్రజలు కోరారు. టవర్లపై అధికారులు చర్యలు తీసుకోకుంటే, పోచారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

# యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**విశ్వంభర, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కటకం అశోక్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జెండా ఎగరవేసి కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అక్బర్ ఖాన్, ఉపాధ్యక్షుడు కోట రాజబాబు, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి లేళ్ల ముక్తేశ్వర్, నయుముద్దీన్, మేసినేని రవిచంద్ర, కిష్ణమోహన్, నేన్నల గట్టన్న, మీర్జా అక్తర్ బేగ్, రంజిత్ రెడ్డి తోపాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ మేయర్‌గా అమర్ సింగ్



**విశ్వంభర, మేడిపల్లి:** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్కా వెంకటరెడ్డిపై అవిశ్వాసం నెగ్గింది. మున్సిపల్ కార్పొరేషన్లో మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. డిప్యూటీ మేయర్ శివకుమార్ సహా మిగతా 21 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ లో చేరారు. మెజార్టీ సభ్యులు కాంగ్రెస్ కే ఉండడంతో జక్కా వెంకట్ రెడ్డి పదవి కోల్పోయారు. కాంగ్రెస్ నుంచి అమర్ సింగ్ ను శుక్రవారం మేయర్ గా ఎన్నుకున్నారు.



నాగుల పంచమి పండుగను పురస్కరించుకొని ఈరోజు వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ వికారాబాద్ పట్టణంలో నాగ దేవతకు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– విశ్వంభర, వికారాబాద్



# స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం

- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిరంతరం జరగాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ఆదర్శంగా నిలవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**విశ్వంభర, భూపాలపల్లి:** స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిరంతరం జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18, 19 వార్డుల ప్రధాన కూడలిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమన్ని అధికారులు ప్రజల సహకారంతో జిల్లాలో విజయవంతంగా అమలు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఐదు రోజులే కాకుండా నిరంతరం జరగాలని సూచించారు. ప్రజలు ఇండ్ల పరిసరాలు, గ్రామాలు, మున్సిపాలిటీలో ప్రతి ఇంటిలో మొక్కలు నాటి సంరక్షిస్తే పచ్చదనం ఏర్పడి మంచి వాతావరణం నెలకొంటుందని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో కచ్చితంగా మొక్కలు నాటి చిన్న పిల్లల మాదిరి చెట్లను కాపాడితే అవి తిరిగి మనల్ని కాపాడతాయని అన్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంచి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఒక కీలక ఘట్టం

**విశ్వంభర, బషీర్‌బాగ్ :** స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా ఉద్యమం ఒక కీలక ఘట్టం అని ప్రముఖ విద్యావేత్త, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయ డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. డి. శోభన దేశ్ పాండే అన్నారు. శుక్రవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయ ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థినులతో మోహంజహి మార్కెట్ నుండి జాతీయ పతాకాలతో నిర్వహించిన ర్యాలీలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. స్వాతంత్ర్య సాధనలో క్విట్ ఇండియా ఉద్యమం ప్రధాన పాత్ర పోషించిందని, యోధుల త్యాగాలను గుర్తించి దేశ ప్రజలు ఐక్యంగా ఉండి దేశాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గద్ద గూటి ఎట్టయ్య ప్రసంగిస్తూ జాతిపిత గాంధీ చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, దేశ ఖ్యాతిని కాపాడేందుకు విద్యార్థులు నడుం బిగించాలాన్నారు. ఈ ఉద్యమంలో కీలకపాత్ర వహించిన నలుగురు నేతలు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, నెహ్రూ, పటేల్, గాంధీలను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసిందని, క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రజల మధ్య సోదర భావం ఐక్యత భావాన్ని బలపరిచిందని వివరించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాజిరెడ్డి ప్రసంగిస్తూ స్వాతంత్రం కోసం ఇండియా ఎన్నో ఉద్యమాలు చేసిందని వాటిల్లో చివరి ఉద్యమం క్విట్ ఇండియా ఉద్యమమని నిజానికి ఇది ఉద్యమం కాదు ఒక యుద్ధమని అన్నారు. ఎన్సీసీ వన్ తెలంగాణ బెటాలియన్ ఎంసీసీ ఆఫీసర్ మేజర్ యన్.సుప్రియ ప్రసంగిస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థులు పాఠశాలలు కళాశాలలను వదిలి ఉద్యమంలో భాగస్వాములు అయి స్వాతంత్రం సాధించడంలో తమ వంతు కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గత 20 సంవత్సరాలకు నిరంతరం ప్రజా సంక్షేమ అభివృద్ధి కొరకు పాటుపడుతూ జాతీయ సమైక్యత, శాంతి, పర్యావరణ పరిరక్షణ, మతసామరస్యం తదితర అంశాలలో ప్రజలను జాగృతి పరుస్తున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్రి రాజిరెడ్డికి మహాత్మా గాంధీ శాంతి పురస్కార్ 2024 ను శాలువా, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగలక్ష్మి, ప్రముఖ సంఘ సేవకులు కె. అంజన్ కుమార్, ప్రముఖ యోగా గురువు యస్ రామకృష్ణ శాస్త్రి, ఢిల్లీ శివకుమార్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.





స్వచ్ఛదనం-పచ్చదనం (వణమహోత్సవం) కార్యక్రమంలో ఫరెస్ట్ డివిజన్ కార్యాలయంలో మొక్కలు నాటి అనంతరం అటవీ అధికారులు నిర్వహించిన బైక్ ర్యాలీనీ జండా ఊపి ప్రారంభించిన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకటరమణరెడ్డి. – విశ్వంభర, కామారెడ్డి



# ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వంద పడకల హాస్పటల్ కు వచ్చే నిరుపేదల కోసం ప్రతిరోజు 250 మందికి పైగా ఉచిత భోజనం అందిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ వారిని భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి అభినందించారు. ఇలాగే మరెన్నో సేవ కార్యక్రమాలు చేపడుతున్న జయశంకర్ ఫౌండేషన్ వారి సేవలను ప్రభుత్వం గుర్తించి వీరికి సహాయ సహకారాలు అందించాలని, దాతలు కూడా ముందుకు వచ్చి వీరికి పెద్ద ఎత్తున విరాళాలు అందించాలని నా వంతు సహకారం కూడా త్వరలోనే అందిస్తానని వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి తెలిపారు.



# వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాస పూజలు

**విశ్వంభర, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలోని వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం నుండి అమ్మవారికి శ్రావణమాసపు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణ కమిటీ తరఫున వాసవి మాతకు తమలపాకులతో అలంకరణ చేయడం జరిగిందని పట్టణ అధ్యక్షులు మోటూరు శ్రీకాంత్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వాసవి మాత పారాయణ మహిళ కమిటీ, వాసవాంబ సేవ సమితి సభ్యులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన పూజారులు కృష్ణమూర్తి శర్మ, గౌతమ్ శర్మ, శ్రీనివాస్ శర్మ నిర్వహించారు.



## పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**విశ్వంభర, పెద్దాపూర్ :** పెద్దాపూర్ గురుకుల పాఠశాలను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సందర్శించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జువ్వాడి కృష్ణరావు పాఠశాలలో జరిగిన సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న వరుస సంఘటనల ను, సమస్యల ను పాఠశాల అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి పాఠశాలలో జరుగుతున్న సంఘటనలు పునవృ త్తం కాకుండా తక్షణమే పరిష్కరించి కారకులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ఉత్తమ జర్నలిస్ట్‌గా సేవారత్న అవార్డు అందుకున్న గుర్రాల నాగరాజు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా మీడియా వృత్తిలో జర్నలిస్ట్ గా కొనసాగుతూ పలు ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పని చేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజల సమస్యలపై పలు ప్రత్యేక కథనాలు రాస్తూ, సామాజికంగా, రాజకీయంగా ప్రజలను, యువతను చైతన్య పరుస్తు సేవలు అందిస్తున్నందుకు గాను యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ గుర్రాల నాగరాజుకి ఉత్తమ జర్నలిస్ట్ గా సేవారత్న పురస్కారం లభించింది. ఈ అవార్డు ఎస్ ఎల్ పి చారిటబుల్ ట్రస్ట్, ఎస్ జే ఆర్ ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో హైదారాబాద్ లోని చిక్కడపల్లిలో త్యాగరాయ కళాభవనంలో బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న, హైకోర్టు అడ్వకేట్ రాపోలు భాస్కర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ నాకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందనీ, నిజానికి జర్నలిజం వృత్తి అంటేనే కత్తిమీద సాములాంటిదని ఎన్నో ఒడిదోడుకులను నిత్యం ఎదుర్కొంటూ వార్తలు రాయాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. జర్నలిస్ట్ అంటేనే వేతనం లేని కలం కార్మికులు వారికి ఇలాంటి అవార్డులతో అయిన గుర్తింపు ఇవ్వడం మా లాంటి ఎందరో జర్నలిస్టుల పనికి దక్కిన గౌరవంగా భావిస్తున్నాను అని అన్నారు. రానున్న రోజుల్లో మరింత బాధ్యతగా విధులు నిర్వహిస్తానని అన్నారు. ఈ అవార్డులు అందించిన ఎస్ ఎల్ పీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రముఖ గాయకురాలు లక్ష్మి ప్రసన్న, ఎస్ జే ఆర్ ఫౌండేషన్ చైర్మన్ లు సినీ నిర్మాతలు సామ శ్రీధర్ గుప్తా, సర్దార్ పంజాల వెంకటేశ్ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గంగాపురం పద్మ, ప్రముఖ ఆధ్యత్మికవేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, ఐ వీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుక్కటపు చంద్రశేఖర్, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ శానుర్ బాబా పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనే ధ్యేయంగా కదిలిన కాళేశ్వరం



**విశ్వంభర, కాళేశ్వరం :** స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ రహిత గ్రామము చేయుటకు 5వ రోజు ఎంపీడీవో శ్రీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ప్లాస్టిక్ భూతం వేషధారణ ప్రదర్శన చేస్తూ ప్లాస్టిక్ వాడకం వలన వాతావరణం, భూమిలో కాలుషితమై అనారోగ్య సమస్యలు, ఇతర ఇబ్బందులకు గురవుతున్నారని అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్లాస్టిక్ వాడరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు, మెడికల్ ఆఫీసర్ సుస్మిత, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, హై స్కూల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు విజయశ్రీ, శ్రీధర్, శ్యామ్, పిల్లలు, గ్రామపంచాయతీ సిబ్బంది మెడికల్ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు, అంగన్వాడి సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం



**విశ్వంభర, ఆమనగల్లు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛతనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు పట్టణం పదిహేనవ వార్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వార్డు కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పరిశుభ్రత, వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో పాఠశాలను పరిశుభ్రం చేయించారు. పరిసరాలు ఎంత శుభ్రంగా ఉంటే మనం అంతా ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ సంతోష, శానిటైజర్ ఇన్స్పెక్టర్ ఎల్లయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు లలిత, కరుణ, భార్గవి, రిజ్వాన పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



**విశ్వంభర, నల్గొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా, ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ, రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందులో బాగంగా నల్లగొండ జిల్లాలో ఎస్పి శరత్ చంద్ర పవార్ నల్లగొండ జిల్లా ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడం కొరకు మిషన్ పరివర్తన్ ను చేపట్టారు. ఇందులో బాగంగా యస్. పి ఆదేశాల మేరకు తనిఖీల ఏర్పాట్లు ముమ్మరం చేయగా అక్రమ గంజాయి విక్రయి స్తున్న ఐదుగురు నిందితుల ముఠా సభ్యులను నల్లగొం డ వన్ టౌన్ పోలీసులు అదుపులో కి తీసుకొని విచారణ చేపట్టారు. వీరి వద్ద నుండి దాదాపు 90 వేల విలువ గల 3.5 కె.జి ల గంజాయి, 4 సెల్ ఫోన్లు, ఒక ఆటో స్వాదీనం చేసుకున్నారు పోలీసులు.

## ప్రభుత్వ పాఠశాలలో శౌచాలయం, సీసీ కెమెరాలు ఏర్పాటు



**విశ్వంభర, మేడ్చల్:** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలోని ఎంపీపీఎస్ స్కూ ల్ లో డివిజన్ జనరల్ సెక్రెటరీ ద్వారంపూడి నాగిరెడ్డి, కళ్యాణి దంపతులు 6.5 లక్షల సొంత నిధులతో బాల బాలికల సౌచాలయం, స్కూల్ కి సీసీ కెమెరాలు అమర్చారు. స్కూల్ హెచ్ఎం కి సౌచాలయానికి సంబంధించిన తాళం చేతులను కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి అందించారు. సీసీ కెమెరాలను జీడిమెట్ల సీఐ జి మల్లేష్ ప్రారంభించారు. స్వచ్ఛదనం- పచ్చదనం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హనుమంత రెడ్డి, మాట్లాడుతూ సౌచాలయం నిర్మాణానికి ముందుకు వచ్చిన ద్వారంపూడి నాగిరెడ్డి దంపతులకు అభినందనలు తెలియజేశారు మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని ఇంకొంతమంది దాతలు ముందుకు వచ్చి ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా మీ మీ కాలనీలోని సమస్యలను పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఏ.ఎం.హెచ్. భార్గవ్, జీడిమెట్ల సీ.ఐ. మల్లేష్, 130 డివిజన్ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి, మహిళ ప్రెసిడెంట్, తులసి, దమ్మని శ్రవణ్ కుమార్, సుభాష్ నగర్ ఫేస్ 1 అధ్యక్షులు బిజిలి కృష్ణ, కాలనీ అసోసియేషన్ పెద్దలు నాగిరెడ్డి, యూత్ మెంబర్స్, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మొక్కలను నిరంతరం సంరక్షించాలి




**విశ్వంభర, ఆమనగల్లు:** అమనగల్ మండలంలోని కోనాపూర్ రామంతల గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి సుజాత, ఆమనగల్లు ఇంచార్జ్ ఏడీఏ ఆదిలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి డి. అరుణకుమారి పర్యటించారు. తెలంగాణ ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటగా కోనాపూర్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కేవలం ఈ ఐదు రోజులే కాకుండా ఈ కార్యక్రమం నిరంతరం జరగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం రాంనూతల గ్రామంలోని అటవీ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సెక్రెటరీలు, వివిధ స్థాయి అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌జేయూ నాయకులకు ఘన సన్మానం



**విశ్వంభర, భూపాలపల్లి:** బీహార్ లో జరిగిన నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరై తిరిగి వచ్చిన తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్ యూని యన్ (టీ.ఎస్.జే.యూ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జల్దీ రమేష్ లను స్థానిక కాకతీయ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉద్యమకా రుడు పైడిపల్లి రమేష్, స్థానిక జర్నలిస్ట్ లు ఘన స్వాగ తం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పక్షాన సమస్యలపై గలమెత్తి, జర్నలిస్ట్ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన జిల్లా జర్నలిస్ట్ లను వారు అభినందించారు. ఈ సందర్భంగా టీ.ఎస్.జే.యూ నేతలు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు తడుక సుధాకర్, బెల్లం తిరుపతి, బండారి రాజు, మేడ వెంకట స్వామి, కనుకుల దేవేందర్, మొకిడి చిరంజీవి, దొమ్మటి రవి, స్టాఫ్ ఫోటో గ్రాఫర్ లు పి.మధుసూదన్, బండ మోహన్, జనార్దన్, సుధాకర్, ఇంతియాజ్, కుమారస్వామి పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



**విశ్వంభర, కరీంనగర్:** ప్రధాని మోదీ మన్ కి బాత్ సందర్భంగా ప్రతి ఇంటిపై "హర్ ఘర్ తిరంగా" జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపు నిచ్చిన నేపథ్యంలో ఈనెల 11 నుండి 15 వరకు తలపెట్టిన హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు భాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కరీంనగర్ టౌన్ వన్ బీజేపీ ఇన్చార్జీ, కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు తమ ఇళ్ళ మీద జాతీయ జెండాను ఎగురవేసి, సెల్ఫీ తీసుకొని హర్ గర్ తిరంగా. కామ్ లో అప్లోడ్ చేసి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారాన్ని చేపట్టాలన్నారు. ఈనెల 11 నుండి 15వ తేది వరకు హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలన్నింటినీ ఒకటో పట్టణ బీజేపీ శ్రేణులు అంతా సమిష్టి కృషితో విజయవంతం చేయాలన్నారు. దేశాన్ని ఒకటి చేసే ఈ అద్భుత కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై, దేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పడానికి పార్టీ శ్రేణులు అందరూ తగిన కృషి చేయాలన్నారు. ఈ కర్యక్రమంలో నరహరి లక్ష్మా రెడ్డి, శివరాజ్, ఎన్నాం ప్రకాష్, జనపట్ల స్వామి, రాగి సత్యనారయణ, చిట్టిబాబు, ఎడమ సత్యనారాయణ, బీజేపీ మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఉప్పరపల్లి శ్రీనివాస్, పొన్నాల రాము, చడ ఆనంద్, బత్తిని మహేష్ గౌడ్, అంజి, పైడి ప్రసాద్, బోయిని శ్రీనివాస్, చిగిరి రవి, తిరుమల రెడ్డి, నరేష్, బత్తిని నరేష్, రామన్ పాల్గొన్నారు.



## కురుమలకు అండగా ఉంటాం

**విశ్వంభర, మేడిపల్లి :** కురుమలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. శుక్రవారం బోడుప్పల్ నగర మేయర్, డిప్యూటీ మేయర్ లను వారి నివాసంలో పీర్జాదిగూడ కురుమ సంఘం నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఫీర్జాదిగూడ కార్పొరేషన్ లో నిర్మాణంలో ఉన్న శ్రీ బీరప్ప దేవాలయం కొరకు నిధులు ఇచ్చేందుకు సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు, ఈస్ట్ బోడుప్పల్ కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప కురుమ, మేడిపల్లి మండల కురుమ సంఘం గౌరవాధ్యక్షుడు, జర్నలిస్ట్ మరాటి మల్లేష్ కురుమ, ఫీర్జాదిగూడ కురుమ సంఘుమ నాయకులు జోగు సోమయ్య కురుమ, మద్దూరి యాదగిరి కురుమ, నోముల శ్రీనివాస్ కురుమ, దేవునూరి గోవింద్ కురుమ, గుంటి సాగర్ కురుమ, మద్దూరి రాజు కురుమ, కృష్ణ మూర్తి కురుమ పాల్గోన్నారు.



## భద్రాచలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. అంబేద్కర్ సెంటర్లోని ఆదివాసీల జెండాను ఎగరవేసిన అనంతరం ఆదివాసీ నాయకుల విగ్రహాలకు ఐటీడీఏ పీఓ బి రాహుల్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు నివాళులు అర్పించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి బ్రిడ్జి సెంటర్ పాత మార్కెట్ ఐటీడీఏ రోడ్డు వరకు ఆదివాసీలు కొమ్ము నృత్యాలు, రేలా నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీలు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఐటీడీఏ పీవో రాహుల్, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు గిరిజనులతో కలిసి రహదా రిపై నృత్యాలు చేశారు, అనంతరం వారి సాంప్రదాయ మైన కొమ్ములను ధరించి ప్రదర్శనలో పాల్గొన్నారు.



నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాష్ట్ర సహకార సంఘం యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, నిజాంబాద్ జిల్లా సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్ చాట్ల రాజేశ్వర్, బి పేట మండల అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు. – విశ్వంభర, నిజామాబాద్

## శాంతి నెలకొల్వాలని యునైటెడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ప్రార్థనలు



**విశ్వంభర, బషీర్ బాగ్:** యునైటెడ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను క్రైస్ట్ బిలి వర్స్ చర్చ్ మొగులమ్మ కాలనీ కూకట్ పల్లి లో నిర్వహి స్తున్నట్లు యునైటెడ్ ఫెలోషిప్ ఫౌండర్ ప్రెసిడెంట్ బిషప్ ఎం.శామ్యూల్ తెలిపారు. ఈ సందర్భంగా దేశం, రాష్ట్రంలో శాంతి నెలకొల్వాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్విరామంగా ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి టీ. దేవానందం, రేవా డేవిడ్ బాలాజీ, రేవా ఆర్పిదాస్, రేవా పి.మోహన్ వాక్యోపదేశము చేస్తారని అన్నారు. కార్యక్రమంలో సువార్త గాయకులు, పాస్టర్ ఆర్. పాల్, పాస్టర్ ముకేష్, బ్రదర్ రీచర్డ్జి, విష్ణు కుమార్, పాస్టర్ డేవిడ్ రాజు లు పాల్గొంటారని తెలిపారు.




## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**విశ్వంభర, ఎల్‌బీ నగర్ :** యన్‌టీఆర్ నగర్ బంజారా కాలనీలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం ఘనంగా జరిగింది. రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు యం గోపినాయక్, వి జగన్‌నాయక్ మాట్లాడుతూ గిరిజన తెగలు ఆగస్టు 9న ప్రపంచ గిరిజన హక్కుల దినంగా జరుపుకోవాలని 1994లో ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసింది. ఆదివాసీ గిరిజన తెగల హక్కులను రక్షిచడం సమాజ పరిణామ క్రమంలో గుర్తించడం జరిగింది. గిరిజన తెగలు తమ హక్కులను సాధ్దించుకునేందుకు ఆగస్టు 9 న ఐక్యరాజ్యసమితి తీర్మానంలో పేర్కొన్నది. భారతదేశంతో పాటు 90 దేశాలు తీర్మానంపై సంతకాలు చేశారాని వారు అన్నారు. అదేవిధంగా యన్ టీ ఆర్ నగర్ లో ఉన్న లంబాడి గిరిజనులకు ఇండ్లు లేని వారికీ డాబాల్ బెడ్ రోమ్ ఇండ్లు, వితంతు, వృద్ధాప్య ఫిన్షన్, మహిళ్ళలకు 2500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన గిరిజనులకు రేషన్ కార్డ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇ మగంత నాయక్, కే ముత్యాలీ, కే నవీన్ నాయక్, సైది బాయి, కే శ్రీనునాయక్, లక్ష్మి బాయి పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

**విశ్వంభర, హైదరాబాద్ (నెక్లెస్ రోడ్) :** చేనేత దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాద్ మహానగరంలోని నెక్లెస్ రోడ్ లో ఉన్న పీపుల్స్ ప్లాజాలో ఈనెల 7న ప్రారంభించిన చేనేత వస్త్ర ప్రదర్శన ప్రజలను ఎంతో ఆకట్టుకుంటున్నది. 10 రోజులపాటు నిర్వహించే ఈ వస్త్ర ప్రదర్శనలో 140 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వీటిలో తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా,బీహార్ రాష్ట్రాలకు చెందిన చేనేత వస్త్రాలను ఈ స్టాల్స్ లో అందుబాటులో ఉంచినట్లు చేనేత జౌళి శాఖ డెవలప్మెంట్ ఆఫీసర్ ఏ శ్రీనివాస్ తెలిపారు. పోచంపల్లి, గద్వాల, వెంకటగిరి, పట్టుచీరలు, చేనేత బెడ్




షీట్లు, లుంగీలు, చీరలు, పంజాబీ డ్రెస్సులు, డ్రెస్ మెటీరియల్, హ్యాండ్ పర్సులు, బ్యాగులు లభిస్తున్నాయని వీటిని కొనుగోలు చేయడానికి నగర ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారని ఆయన తెలిపారు



## వసతి గృహాలలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలి

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**విశ్వంభర, వికారాబాద్ :** వసతిగృహ సలహా సంఘం సమావేశము శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి సంక్షేమ శాఖల వసతి గృహముల నూతన విద్యార్థుల ప్రవేశముల కొరకు సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. వీరితోపాటు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్ మల్లేశం, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కే ఉపేందర్, షెడ్యూల్ తెగల అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి ,నియోజకవర్గంలోని వివిధ మండలాల ఎంపీడీవోలు, తహసీల్దారులు, ఎంఈఓ లు నియోజకవర్గంలోని వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహంలోని విద్యార్థుల ఖాళీలను పూర్తి చేయడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ కొన్ని సూచనలు చేశారు. వసతి గృహంలోని మౌలిక వసతులు సక్రమంగా ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే అన్నిరకాల సదుపాయాలు , వసతులు సకాలంలో అందించేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు . జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు వసతి గృహాలను సక్రమంగా పర్యవేక్షణచేసి వసతి గృహం విద్యార్థులు అందరూ చదువు విషయంలో శ్రద్ధ వహించి వసతి గృహ సంక్షేమ అధికారులు వ్యక్తిగత శ్రద్ధ వహించాలి అని అన్నారు. ఆరోగ్యము మానసిక వికాసము అభివృద్ధి గురించి కూడా అవగాహన కల్పించాలని అన్నారు.

## మూలాలను మరిచిపోవొద్దు

**విశ్వంభర, భూపాలపల్లి :** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని యావత్తు ప్రపంచం జరుపుకోవడం శుభపరిణామం అని సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి , న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయ రాం రెడ్డి అన్నారు. ఏజెన్సీలుగా నోటిఫై అయినటువంటి ఏరియాలలో భూములపై సివిల్ కోర్టులకు ఎటువంటి అధికారాలు ఉండవని, సర్వాధికారాలు ఐటిడిఏ లకు మాత్రమే వుంటాయని సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవా న్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతు భారత సమాజంలో అంటరానితనం నేరం అయినప్పటికీ నిత్య జీవితంలో అది అనధికా రంగా కొనసాగుతుందని అన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు పెంచుకోవాల



ని తద్వారా ప్రపంచంతో కనెక్ట్ కావచ్చు అన్నారు,పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఈసంపల్లి రాజారత్నం అధ్యక్షత వహించిన సమావేశంలో అడ్వకెట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బల్ల మహేందర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జి. ప్రియాంక, అడ్వకేట్ రత్నం కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెట్లు నాటడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగం

**విశ్వంభర, వికారాబాద్:** చెట్లను నాటినట్లయితే ప్రకృతిని కాపాడిన వారమవుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఇ. శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా వికారాబాద్ మండలం ఫుట్ కొండాపూర్, అనంతగిరి అటవీ పరిసరాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్, వికారాబాద్ జిల్లా స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేక అధికారి ఇ.శ్రీదర్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెద్ద మొత్తంలో చెట్లు నాటడం వల్ల భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జైదుపల్లి పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో ముచ్చటిస్తూ తమ భవిష్యత్తులో ఏ రంగాన్ని ఎంచుకుంటారని అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా కమిషనర్, కలెక్టర్ లు అధికారులతో కలిసి అటవీ ప్రాంతంలోని హిల్ వ్యూ పాయింట్ నుండి అటవీ అందాలను తిలకించారు. వన మహోత్సవ కార్యక్రమంలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డీవైఎస్ఓ హనుమంతరావు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్




శాఖ డిప్యూటీ కమిషనర్ దశరథ, జిల్లా సూపరింటెండెంట్ విజయ భాస్కర్, అబ్కారీ, అటవీ శాఖ అధికారులు, జైదుపల్లి పాఠశాల బాల, బాలికలు పాల్గొన్నారు.

## దళిత మహిళ పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఇన్స్పెక్టర్‌ని విధుల నుండి తొలగించాలి



**విశ్వంభర, ఎల్బీనగర్:** దళిత మహిళ సునీత పై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అధికారిని వెంటనే విధుల నుండి పూర్తిగా తొలగించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ అన్నారు. శుక్రవారం బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షులు పానుగంటి ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో ఎల్బీనగర్ లో నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహాం శేఖర్ లు హాజరై మాట్లాడుతూ షాదనగర్ పట్టణంలో దళిత మహిళా సునీతపై దాడి అమానవీయం అని వివస్త్రను చేసి భర్త, కొడుకు ఎదుట థర్డ్ డిగ్రీ ప్రయోగించిన డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామిరెడ్డిని వెంటనే విధుల నుండి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంత దారుణం జరిగిన ప్రభుత్వం స్పందించకపోవడం, అధికారిపై చర్యలు తీసుకోకపోవడం ఇది కుల, దొర దురాహంకార నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఒక దళిత మహిళ పై పోలీస్ లాకప్ లో దాడి అనేది నిరంకుశ కుల వాదానికి నిదర్శనం అని అన్నారు. అగ్రవర్ణాల స్త్రీల పై దాడి జరిగితే ప్రభుత్వం అధికారులు ఇదే విధంగా స్పందిస్తారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాసంఘాలు, ప్రజా ప్రతినిధులు ఇప్పటికీ నోరు విప్పకపోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. ఈ సంఘటన పై కనీసం ఉప ముఖ్యమంత్రి, స్పీకర్ స్పందించక పోవడం హేయమైన చర్య అని అన్నారు. సరైన న్యాయం చేయకపోతే డీజీపీ, దళిత ఎమ్మెల్యేల కార్యాలయాలు ముట్టడి చేస్తాం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుండెల ధర్మేందర్, నిషాని రామచంద్రం, రాష్ట్ర కార్యదర్శులు గ్యార జగన్, దయాకరన్ మౌర్య, జిల్లా నాయకులు పల్లాటి రాములు, మాసూరి నాగరాజు పాల్గొన్నారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా కులగణన జరిపి, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చెయ్యాలని వక్తలందరు ఏకగ్రీవంగా ముక్త కంఠంతో నినదించారు. లేని పక్షంలో బీసీలనుంచి బంగపాటు తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ దేశంలో కులగణన, బీసీ రిజర్వేషన్ల పై పార్లమెంట్ లో బీజేపీతో కొట్లాడుతుంటే ఆయన స్ఫూర్తితో పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బీసీ రిజర్వేషన్లు కల్పించే విషయంలో స్పష్టత లేకపోవడం శోచనీయమని వక్తలు మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ పూర్తి స్థాయిలో అమలుకోరకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ మేధావులు, ఉద్యమకారులతో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకోవాలని ప్రభుత్వానికి చూచించారు. కామారెడ్డి డిక్లరేషన్ ను వెంటనే అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన చేపట్టాలని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుచెయ్యాలని, స్థానిక రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చెయ్యాలని, ప్రభుత్వ సివిల్ కాంట్రక్టుల్లో అండ్ మెయిన్టనెన్స్ కాంట్రాక్టులలో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుచెయ్యాలని, మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి బీసీ యువతకు 10 లక్షల రూపాయల సహాయం అందించాలని, పెండింగ్ లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ అండ్ స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, బీసీ సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో డైట్ చార్జీలు పెంచాలని, ఈఏసెట్ (ఈఏపీసీఈటీ) ద్వారా క్వాలిఫై అయిన ప్రతి బీసీ విద్యార్థికి పూర్తి స్థాయిలో ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలి, అండ్10 ర్యాంక్ క్యాప్ సిస్టం ను వెంటనే తొలగించాలని, మహాత్మ జ్యోతిరావు పూలే విదేశీ విద్యానిధి స్కిం అరుహులందరికి వర్తింపజేయాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ముఖ్యవక్తగా ప్రొఫెసర్ ఇంకొండ తిరుమలి, బత్తుల సిద్దేశ్వర్లు హిందు బీసీ మహాసభ అధ్యక్షులు,ప్రో ప్రబంజన్ యాదవ్, పాలడుగు శ్రీనివాస్ ఓయూ జాక్ కన్వీనర్, దేశగాని సాంబ శివ గౌడ్ బీసీ బీసీ ఉద్యమ వేదిక అధ్యక్షులు,కట్టెకోల శ్రీహరి ముదిరాజ్, సురేష్ ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, వాసు.కె యాదవ్ బహుజన సేన అధ్యక్షులు,బొంగు ప్రసాద్ గౌడ్ బ్లూ ఇండియా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, దేశం మహేష్ గౌడ్ ఓబీసీ ఆజాది ఆందోళన్ అధ్యక్షులు, పోశం అశోక్ రేపటి తెలంగాణ అధ్యక్షులు, బెల్లం మాధవి సావిత్రి భాయ్ పూలే మహిళ సంఘం అధ్యక్షురాలు, మట్టా జయంతి గౌడ్ బీసీ మహిళ జేఏసీ చైర్మన్, కాల్వ మధు బాబు, మల్లేష్‌యాదవ్, సాయికిరణ్ గౌడ్ పాల్గొన్నారు.



## ఘనంగా కోమటిరెడ్డి లక్ష్మి జన్మదిన వేడుకలు

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు బిక్షపతి నాయక్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏపూరి సతీష్, గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ,దూసరి వెంకటేష్,రాచకొండ రమేష్ , పిఏసిఎస్ చైర్మన్ ఏర్పుల సుదర్శన్, యూత్ కాంగ్రెస్ నాయకులు చిలువేరు శంకర్ , అందే నరేష్ యాదవ్, ఉప్పల నాగరాజు, సురేష్ యాదవ్, వీడెం సాయి, కడారి యశ్వంత్ యాదవ్, బద్దుల యాదగిరి, గోపాల్ , లక్ష్మణ్ నాయక్, కట్ట రాములు, మందుగుల శ్రీనివాస్, ఈసం బన్ని, ఎర్రోళ్ల చంద్రయ్య పాల్గొన్నారు .



## ఎమ్మెల్యేను కలసిన మైనార్టీ నాయకులు

**విశ్వంభర, నార్కెట్‌పల్లి :** షాదీ ఖానా , ఖబ్రస్థాన్ పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని ముస్లిం మైనారిటీ నాయకులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను కలిశారు. ఎస్‌కే సమద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. ఇట్టి విషయం పై ఎమ్మెల్యే సానుకులంగా స్పందించి వాటికి సంబందించిన అధికారులతో మాట్లాడి త్వరతగతిన పూర్తి చెయ్యాలని అదేశాలు జారిచేసారు. కార్యక్రమంలో ఎండీ రహీం అలీ, కరీం ఖాన్, జాన్ ఖాన్, యూసుఫ్, ఫయాజ్ ,సలీమ్, చాంద్ పాల్గొన్నారు



## ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**విశ్వంభర, నాగోల్:** పెద్ద అంబర్ పేటలోని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త గోదాములో పుట్ట వద్ద నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది అని, రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పాములను పరమేశ్వరుని అంశంగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ వీ ఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న, ఉప్పల సాయి కిరణ్, ఉప్పల సాయి తేజ, బందువులు, గోదాం వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.




## ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం

**విశ్వంభర, ఉప్పల్ నియోజకవర్గం :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ,కమిషనర్ రామలింగం ఆదేశాల మేరకు 28వ డివిజన్ శ్రీ సాయి ఎంక్లివ్ కాలనీలో స్వచ్ఛదన- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని కార్పొరేటర్ చీరాల నర్సింసింహా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పిచ్చి మొక్కల నిర్మూలనకు గడ్డి మందును మరియు దోమలు పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ శ్రీనివాస్ మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శుక్రవారం నాడు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై కాంగ్రెసు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నత పాఠశాల ఎస్ఎంసి మాజీ చైర్మన్ వీరసరపు వెంకన్న, సీనియర్ నాయకులు గట్టు శీను, ఇంజమూరి నరసింహ, ఇంజమూరి నరేష్, గట్టు యాదగిరి, గడ్డమీది చంద్రయ్య, కోరే బీరయ్య ,వనం నరసయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతగాని మల్లేశం, తాజా మాజీ సర్పంచ్ జన్నాయకోడె నగేష్ ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలకు, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శుక్రవారం రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం)మండలం రాయపల్లి గ్రామంలో గౌడ సంఘ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన అదేవిధంగా వాటర్ ప్లాంట్ ని ప్రారంభించారు. అనంతరం ఖప్రాయపల్లి గ్రామంలో శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఆ తర్వాత సారగండ్ల గూడెం గ్రామంలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామల్లో స్వచ్ఛధనం, పచ్ఛధనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పారిశుద్ధ్య పనులు గ్రామంలో సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు ,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సహాయ నిధి చెక్కులు మంజూరు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం లింగరాజు పల్లి గ్రామానికి చెందిన కావటి పద్మ , నరసింహ గత సంవత్సరం అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం వైద్యం చేయించుకోవడానికి లక్ష రూపాయలు ఖర్చు కాగా ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా అట్టి దరఖాస్తు పెండింగ్ లో ఉండగా తాజా మాజీ సర్పంచ్ ఎర్ర గీత విఠల్ రెడ్డి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకొని పోవడంతో ప్రత్యేక చొరవ తీసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60 వేల రూపాయల చెక్కును మంజూరు చేయించారు . మా సమస్యలు చెప్పగానే వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంజూరు చేయించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి ధన్యవాదాలు తెలిపారు . ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ సభ్యులు కోడిత్యాల నరేందర్ గుప్తా , తాజా మాజీ సర్పంచ్ ఎర్ర గీత విఠల్ రెడ్డి , మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి , తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## స్కూల్‌లో పిల్లలున్నారు.. మరి పంతులు ఎక్కడ?



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం గ్రామంలో చదువుకోవటానికి పిల్లలు ఉన్నారు మరి చదువు చెప్పే పంతులు లేకుండా పోయారు. గత ఎనిమిది రోజుల నుండి పిల్లలు పంతుల్లు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో పాఠాలు చెప్పే టీచర్ ప్రమోషన్ పొంది బదిలీపై వేరే ఊరు వెళ్లడంతో పిల్లలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ సిఆర్పి నరసయ్య పర్యవేక్షణలో పిల్లలు ఉంటున్నారు. సి ఆర్ పి లు పిల్లలకు చదువులు ఎలా చెపుతారు అని తల్లిదండ్రులు వాపోతున్నారు. పిల్లలకు వచ్చిన చదువు కాస్త పోయే పరిస్థితిలో ఉంది. ఇప్పటికైనా యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు అంటున్నారు. దీనిపై ఎం ఈ ఓ శ్రీధర్ ని వివరణ అడగగా మండలంలో నాలుగు గ్రామాల పాఠశాలలో సింగిల్ టీచర్స్ సమస్య ఉన్నందున ఎవరిని అడ్జస్ట్ చేయాలన్నా కుదరడం లేదని కావున మంగళవారం వరకు ఈ సమస్యను పరిష్కారం అయ్యేలా చూస్తామని వారు తెలియజేశారు.



## వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి

**విశ్వంభర, కరీంనగర్:** తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఆద్వర్యంలో నగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించడం జరిగినది. నగరంలో చాల రోడ్లు దెబ్బతిన్న అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యలను గాలికి వదిలి వేయడం వారి నిర్లక్షానికి నిదర్శనం మన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని ప్రతినిధి బృందం సభ్యులు, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య, తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంటు ఉపాధ్యక్షులు సంధభోయిన రాజేశం, కరీంనగర్ పార్లమెంట్ వాణిజ్యవిబాగం అధ్యక్షులు ఎలిమిల్ల కిషన్, కరీంనగర్ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఇట్ట మల్లేశం పాల్గొని పర్యవేక్షంచి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని అన్నారు.

## నాగుల పంచమి ప్రత్యేక పూజలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో నాగుల పంచమి సందర్భంగా నాగ దేవతకి మాజీ రైతు బంధు జిల్లా డైరెక్టర్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ తో కలిసి తాజా మాజీ ఎంపీటీసీ సభ్యురాలు యాస కవిత ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా యాస కవిత ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలకు నాగ పంచమి శుభాకాంక్షలు తెలిపారు . నాగ దేవతని అత్యంత భక్తి భావంతో పూజిస్తే కష్టాలు పోయి శుభాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**విశ్వంభర, ఆమనగల్లు:** యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ కూడలిలో యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రవికాంత్, అసెంబ్లీ అధ్యక్షులు అనిల్, మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షులు వస్పుల మనయ్య, వెంకట్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వస్పుల శ్రీశైలం, సీనియర్ నాయకులు ఖాదర్, విజయ్, కొప్పు రాఘవేందర్ కరీం, గాజుల సురేష్, రహీం, రాగ్య, తాలూకా కార్యదర్శి ఫిరోజ్, మహేష్, యువజన కాంగ్రెస్ నాయకులు అభినవ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**విశ్వంభర, మీర్‌పేట్ :** కళాశాల దశ విద్యార్థులకు ఎంతో ముఖ్యమని, ఈ దశలోనే చదువుపై దృష్టి సారించి చెడు వేసినాలకు దూరంగా ఉండాలని మాజీ శాసనసభ్యులు, టీకేఆర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ తీగల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మీర్పేట్ లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో టీకేఆర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎన్ఎస్ఎస్, తెలంగాణ యాంటీ నేరోటిక్స్ బ్యూరో వారి ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిలుగా తీగల, తెలంగాణ యాంటీ నారో ట్రిక్స్ బ్యూరో డీ.ఎస్.పీ సుబ్బరామిరెడ్డి లు హాజరయ్యారు. అనంతరం తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు అందరూ వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండాలన్నారు. వారి యొక్క జీవిత లక్ష్యాలను, తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత చదువులు చదివి వారి యొక్క కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా తయారు కావాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ అవేర్నెస్ కోసం మేము ఎన్నో కార్యక్రమాలు



చేపట్టినప్పటికీ ఇంకా ఎక్కడో ఏదో ఒకచోట డ్రగ్స్ మహమ్మారిన విద్యార్థులు వారి జీవితాలను నాశనం చేస్తుంది. ముఖ్యంగా మన దేశాన్ని శత్రు దేశాలు ఫైనాన్షియల్ గా, డామినేట్ చేసే విధంగా వారు అనేక మార్గాల ద్వారా మన దేశానికి డ్రగ్స్ ను సరఫరా చేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ సీఐ ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, సీఐ నాగరాజు, సునీత, ప్రిన్సిపల్స్ డివి రవిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## హెలిప్యాడ్ సభా స్థలాన్ని పరిశీలించిన అధికారులు

**విశ్వంభర, డిండి:** దేవరకొండ నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టు పనులపై ఆదివారం తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాలలో రివ్యూ సమావేశానికి విచ్చేస్తున్న పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ సభా స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, నీటిపారుదల శాఖ అధికారులు ఎస్ సి వెంకటేశ్వర్లు, ఈ ఈ శ్రీధర్, డిఈ మనోహర్, ఏ ఈ హరినాథ్, ఆర్ అండ్ బి శాఖకు చెందిన డి ఈ భాస్కర్, ఎస్ ఈ సత్యనారాయణ, పోలీస్ శాఖ అధికారులు సీఐ సురేష్, ఎస్ ఐ రాజు, ఆర్ ఐ శ్యామ్, తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల స్కూల్ టీచర్ ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట రూరల్ ఎస్సైకి సన్మానం

**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రూరల్ ఎస్సై మిరాల అనిల్ కుమార్ ని శుక్రవారం రోజున నీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం, వికలాంగుల సంఘం ఆత్మకూరు(ఎం) అధ్యక్షులు మజ్జిగ మల్లయ్య, నంద రమేష్ నూతనంగా జాయిన్ అయిన అనిల్ కుమార్ కి ఘనంగా సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల పంచమి పండుగ

**విశ్వంభర, ఘట్కేసర్:** ప్రతి ఏడాది శ్రావణ మాసంలో శుక్ల పంచమి రోజున నాగ పంచమి పండుగను హిందువులు ఘనంగా జరుపుకుంటారు. హిందూ పురాణాల ప్రకారం, నాగ పంచమి రోజున పాములకు ప్రత్యేక పూజలు చేసి, పాలు పోసి, నైవేద్యం సమర్పించడం వల్ల సకల దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఘట్కేసర్ మండల్ ఎదులాబాద్ సాయిబాబా ఆలయంలో మహిళలు తెల్లవారు జాము నుండే పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. వైవాహిక సమస్యలు తొలగిపోతాయని, గర్భదోషాలన్నీ మాయమవుతాయని మహిళలు నమ్ముతారు. మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా నాగుల పంచమి వేడుకలు జరిగాయి.





తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కరీంనగర్ అధ్యక్షుడు అబ్దుల్లా అసద్, సెక్రటరీ మహ్మద్ సిరాజ్ మసూద్, వైస్ ప్రెసిడెంట్ సాదత్ అలీ సిద్ధిఖీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అఫ్జల్ పాషా, జాయింట్ సెక్రటరీ మహ్మద్ అజహరుద్దీన్, శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కొత్తగా నామినేట్ అయిన కాంగ్రెస్ ప్రెసిడెంట్ నరేంద్ర రెడ్డిని కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. – విశ్వంభర, కరీంనగర్



## ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర

- నాకు వ్యతిరేకంగా కుట్రపన్నారు
- బీజేపీ, జేడీఎస్ నేతలపై సిద్ధరామయ్య విమర్శలు

**మైసూర్:** కాంగ్రెస్ జన్ ఆందోళన యాత్రలో భాగంగా మైసూర్ వేదికగా కర్నాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం బీజేపీ, జేడీఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. రాజ్‌భవన్ కేంద్రంగా వారు (బీజేపీ-జేడీఎస్) తనకు వ్యతిరేకంగా కుట్ర పన్నారని ఆరోపించారు. తనకు భూమి కేటాయించాలని తాను తన పలుకుబడిని ఉపయోగించానని బీజేపీ, జేడీఎస్ నేతలు ఆరోపిస్తున్నారని అన్నారు. మీ హయాంలోనే మీరు నాకు భూమి కేటాయిస్తే అది నా తప్పెలా అవుతుందని సిద్ధరామయ్య కాషాయ నేతలను ప్రశ్నించారు. తన ప్రతిష్టను దెబ్బతీసి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని అన్ని రకాలుగా బీజేపీ, జేడీఎస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్‌లో ఎలాంటి అవినీతి లేదని తాను చెప్పడం లేదని స్పష్టం చేశారు. కొందరు అవినీతి అధికారులు, బ్యాంక్ అధికారులను ఈ స్కామ్‌లో ప్రమేయం ఉన్నట్టు గుర్తించి రూ. 87 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. ఈ కేసులో చార్జిషీట్ కూడా దాఖలైందని చెప్పారు. పోక్సో కేసులో మాజీ సీఎం యడియూరప్పపై చార్జిషీట్ నమోదైందని, ఆయన రాజకీయాల నుంచి తప్పుకోవాలని సిద్ధరామయ్య డిమాండ్ చేశారు. ఆయన రాజకీయాల్లో కొనసాగేందుకు నైతిక హక్కు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. యడియూరప్ప కుమారుడు విజయేంద్ర ఎన్నో స్కామ్‌ల్లో కూరుకుపోయారని సిద్ధరామయ్య ఆరోపించారు.

## ఉభయసభలు నిరవధిక వాయిదా

### ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. ముఖ్యంగా నీట్ లీకేజీ వ్యవహారం, రైల్వే భద్రత తదితర అంశాలు ఉభయ సభలను కుదిపేశాయి. పార్లమెంట్ సమావేశాలు గత నెల 22 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలి రోజు 2023-24 ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 'భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు పటిష్టంగా ఉంది' అని ఈ ఆర్థిక సర్వేలో పేర్కొన్నారు. ఆ తర్వాత 23వ తేదీన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఎన్డీయే కూటమి ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌పై ఉభయ సభల్లో వాడీవేడిగా చర్చ కొనసాగింది. చర్చ అనంతరం కేంద్ర బడ్జెట్‌కు సభ ఆమోదం తెలిపింది. ఇక ఈ సమావేశాలు ఆగస్టు 12 వరకూ కొనసాగుతాయని ప్రభుత్వం ముందే ప్రకటించినప్పటికీ ఉభయ సభలు ముందుగానే నిరవధికంగా వాయిదా పడ్డాయి.




## భవిష్యత్‌లో మన అథ్లెట్లు మెరుగైన సామర్థ్యం కనబరుస్తారు

### కంగనా రనౌత్

**ఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించిన నీరజ్ చోప్రాను బీజేపీ ఎంపీ, బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ ప్రశంసించారు. భారత్ స్వర్ణ పతకం సాధించలేదు..కానీ భవిష్యత్‌లో మన అథ్లెట్లు మెరుగైన సామర్థ్యం కనబరుస్తారనే విశ్వాసం తనకుందని ఆమె చెప్పారు. ఒలింపిక్స్‌లో భారత హాకీ పురుషుల జట్టు కాంస్య పతకం సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. భారత హాకీ ఆటగాళ్లు దేశంలో హాకీ గత వైభవాన్ని తిరిగి పొందేందుకు శ్రమిస్తున్నారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారని ఆమె గుర్తుచేశారు. కాగా, ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించడం గొప్ప విషయమని భారత మాజీ క్రికెటర్, ఆప్ ఎంపీ హర్భజన్ సింగ్ అన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహించే అద్భుత అవకాశం కేవలం కొద్దిమంది అథ్లెట్లకే లభిస్తుందని చెప్పారు. ఒలింపిక్స్‌లో దేశం తరపున పాల్గొన్న క్రీడాకారులందరికీ తాను శిరస్సు వంచి సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటడం ఏమంత సులభం కాదని, దీనికి చిత్తశుద్ధి, కఠోర శ్రమ అవసరమని పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రాను తాను అభినందిస్తున్నానని అన్నారు. నీరజ్ చాలా బాగా ఆడాడని, ఆయన తమ బంగారం అని హర్భజన్ అన్నారు. భారత రెజ్లర్ వినేశ్ ఫొఘాట్‌పై అనర్హత వేటు పడిన విషయం ప్రస్తావిస్తూ ఈ సంక్లిష్ట సమయంలో తాను ఆమె వెన్నంటి నిలుస్తానని, ఆమె బాధను కేవలం ఓ అథ్లెట్ మాత్రమే అర్థం చేసుకోగలరని చెప్పారు. వినేష్ ఫొఘాట్ రజత పతకానికి అర్హురాలని హర్భజన్ సింగ్ తేల్చిచెప్పారు. కాగా, పారిస్ ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా సత్తా చాటాడు. స్వర్ణం అందిస్తాడనే అంచనాలను అధిగమించలేకపోయినా రజతం దక్కించుకున్నాడు.

# మనీశ్ సిసోడియాకు బెయిల్

### నిజం గెలిచిందంటూ భావోద్వేగానికి గురైన మంత్రి అతిషీ



**ఢిల్లీ:** ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోడియా కు భారీ ఊరట లభించిన విషయం తెలిసిందే. మద్యం కుంభకోణం కేసులో ఆయనకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో 17 నెలల తర్వాత ఆయన జైలు నుంచి బయటకు రాబోతుండటంతో ఆప్ నేతలు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకుంటున్నారు. ఇక సిసోడియాకు బెయిల్ రావడంపై ఢిల్లీ మంత్రి అతిషీ సంతోషం వ్యక్తం చేశారు. 'నిజం గెలిచింది..' అంటూ కెమెరా ముందు తీవ్ర భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. '17 నెలల పాటు జైలులో ఉన్న మనీశ్ సిసోడియాకు బెయిల్ లభించింది. ఈ రోజు నిజం గెలిచింది. ఇది ఢిల్లీ ప్రజల విజయం. విద్యార్థుల విజయం. సిసోడియా ఢిల్లీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించడం కొందరికి నచ్చలేదు. అందుకే తప్పుడు కేసులో ఇరికించి జైలుపాలు చేశారు. ఇప్పుడు న్యాయమే గెలిచింది' అంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఇక ఇదే కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహా ఇతర నేతలకు కూడా న్యాయం జరుగుతుందని అతిషీ ఆశాభావం వ్యక్తం చేశారు. వారు కూడా త్వరలోనే బయటకు వస్తారని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. మద్యం కుంభకోణం కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సిసోడియాను అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తీహార్ జైల్లోనే ఉంటున్నారు. బెయిల్ కోసం తీవ్రంగా పోరాటం చేశారు. ఈ క్రమంలో సుప్రీం తీర్పుతో 17 నెలలుగా జైలు జీవితాన్ని గడుపుతున్న సిసోడియాకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ నేపథ్యంలో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుపై ఆమ్ ఆద్మీ పార్టీ సంతోషం వ్యక్తం చేసింది. చివరికి సత్యమే గెలిచింది అంటూ ఆప్ నేతలు సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నారు. మరోవైపు ఇదే కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా అరెస్టైన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో కేజ్రీని ఈడీ అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి ఆయన కూడా బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ.. ప్రస్తుతం సీబీఐ కేసులో తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మరోవైపు కేజ్రీ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కస్టడీ గడువు ముగియడంతో సీబీఐ ఆయనను తిహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసిన విషయం తెలిసిందే.



## క్రిమీలేయర్ నిర్ణయాలను అమలు చేయరాదని కోరాం

- ఎంపీల ఫిర్యాదులను ఆలకించారు
- ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ సుప్రీం తీర్పుపై ప్రధానిని కలిసిన 100 మంది బీజేపీ ఎంపీలు

**ఢిల్లీ:** ఎస్సీ, ఎస్టీల ఉపవర్గీకరణతో పాటు క్రిమీలేయర్ అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పును ఇచ్చింది. అయితే ఆ తీర్పుపై వంద మంది బీజేపీ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉభయసభలకు చెందిన ఆ ఎంపీలు.. ప్రొఫెసర్ సికందర్ కుమార్ నేతృత్వంలో .. ప్రధాని మోదీని శుక్రవారం కలిశారు. అందరు ఎంపీల ఫిర్యాదులను ప్రధాని మోదీ ఆలకించారని, ఎంపీలకు అనుకూలంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని ఎంపీ సికందర్ కుమార్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ చేపట్టాలని వేసిన పిటీషన్లపై తీర్పును ఇస్తూ.. ఏడుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. క్రిమీలేయర్ అంశంపై సుప్రీం కోర్టు చేసిన సూచనల గురించి దరఖాస్తు ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. క్రిమీలేయర్ నిర్ణయాలను అమలు చేయరాదు అని వంద మంది ఎంపీలు ప్రధాని మోదీని కోరినట్లు తెలుస్తోంది.

## బంగ్లాదేశ్‌లో హిందువుల, మైనారిటీల కోసం కేంద్రం చొరవ

### కమిటీని ఏర్పాటు చేసిన హోంమంత్రిత్వ శాఖ



**ఢిల్లీ:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం వీడిన అనంతరం హింసాకాండ కొనసాగుతూనే ఉన్నది. ఈ క్రమంలో కేంద్రం చొరవ తీసుకున్నది. అక్కడి హిందువులు, మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో నివాసం ఉంటున్న భారతీయులు, హిందువులు, మైనారిటీల భద్రత, సౌకర్యాలకు సంబంధించి అక్కడి హోంమంత్రిత్వ శాఖ అధికారులతో ఈ కమిటీ చర్చలు జరుపనున్నది. భారత్ %-% బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రత, ప్రస్తుత పరిస్థితులను సైతం సమీక్షించనున్నది. బంగ్లాలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మోదీ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఈస్ట్ జోన్ ఏడీజీని కమిటీకి చైర్మన్‌గా నియమించారు. బీఎస్ఎఫ్ సౌత్ బెంగాల్ ఐజీ, ఐజీ బీఎస్ఎఫ్ త్రిపుర, ఇండియన్ ల్యాండ్ పోర్ట్స్ అథారిటీకి చెందిన ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సభ్యుడు, సెక్రటరీ సభ్యులుగా ఉంటారు. వాస్తవానికి ఇస్లామిక్ ఛాందసవాదులు బంగ్లాదేశ్‌లోని హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడుతున్నారు. సోమవారం మొదలైన దాడుల్లో ఇప్పటి వరకు వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దాడుల భయంతోనే అనేక కుటుంబాలు మూకుమ్మడిగా వలస వెళ్లాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని హిందువులు భారత్‌లోకి వచ్చేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దులోని ఠాకూర్‌గావ్, పంచగఢ్ ప్రాంతాలకు వేలాది మంది హిందువులు చేరుకున్నారు. పలుచోట్ల ఇండ్లు, దుకాణాలతో పాటు దేవాలయాల్లోని విలువైన వస్తువులను సైతం దుండగులు దోచుకు వెళ్తున్నట్లు సమాచారం. అక్కడే ఉంటే చంపేస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. అయితే, బంగ్లాదేశ్ బోర్డ్ గార్డ్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నా హిందూ కుటుంబాలు స్వదేశానికి వెళ్లేందుకు సిద్ధంగా లేవని.. అయితే, భారత సరిహద్దుల్లోకి ప్రవేశించేందుకు వీసాలు లేవని అలోఖవ సంఘ అధ్యక్షుడు మోజక్రుల్ ఆలం కొచ్చి తెలిపారు. ప్రస్తుతం సరిహద్దుల్లో 5వేల మంది వరకు ఉన్నట్లుగా చెప్పారు.




## విద్యార్థుల భవిష్యత్‌ను ప్రమాదంలో పడవేయలేం

### నీట్ పీజీని వాయిదా వేయాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ:** ఈ నెల 11న జరగనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్ష వాయిదా వేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. పరీక్షకు రెండు రోజుల ముందు పరీక్షను వాయిదా వేయాలని ఆదేశించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇప్పుడు నీట్ పీజీని వాయిదా వేయిస్తున్నారా..? ఆ పరీక్షను ఎలా వాయిదా వేయగలం ? ఈ రోజుల్లో పరీక్షను వాయిదా వేయమని అడుగుతూ వస్తున్నారు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే వాదనలు వినిపించారు. ఉదయం ఒక పరీక్ష, మధ్యాహ్నం మరో పరీక్ష ఉన్నందున పరీక్షను రీషెడ్యూల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండులక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉందని.. 50 మంది అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్ మేరకు పరీక్షను వాయిదా వేయాలని ఆదేశించలేమని చెప్పింది. కొందరు పిటిషన్లతో చాలామంది అభ్యర్థుల కెరీర్‌ను ప్రమాదంలో పడవేయలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అసౌకర్యంగా ఉన్న నగరాల్లో ఎగ్జామ్ సెంటర్‌ను కేటాయించడం వల్ల చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విశాల్ సోరెన్ అనే పిటిషన్‌లో పేర్కొన్నారు.

## అంధులకు అంతర్జాతీయ వర్సిటీ

**భువనేశ్వర్:** భారత్లో అందులకు మొట్టమొదటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఒడిశా ప్రభుత్వం జపాన్లోని సుకుబా యూనివర్శిటీతో ఈ అంశంపై చర్చలు జరుపుతోంది. సోషల్ సెక్యూరిటీ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ (ఎస్ఎస్ఈపీడీ) విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ బిస్తుపాద సేథీ ఈ విషయాన్ని వెల్లడించారు. తాజాగా రాష్ట్రానికి విచ్చేసిన సుకుబా యూనివర్శిటీ బృందంతో ఎస్ఎస్ఈడీపీ అధికారులు చర్చలు జరిపినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 50లక్షల మందికి పైగా అంధులు ఉండగా.. ఒక్క ఒడిశాలోనే 5 లక్షల మంది ఉన్నారు. వీరిలో దాదాపు 2లక్షల మంది యువతే కావడం గమనార్హం. వీరందరికీ విద్య, సాంకేతిక నైపుణ్యం అందించి ఉద్యోగవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే ఈ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ వర్సిటీకి ప్రముఖ కవి, సంఘ సంస్కర్త భీమ భోయ్ పేరును పెట్టనున్నట్లు సేథీ తెలిపారు. అదేవిధంగా యూనివర్శిటీలో విద్యతో పాటు పాలసీ రీసెర్చిలో ఒకేషనల్ కోర్సులు, ఆక్యూపంక్చర్, ఫిజియో థెరపీలో సాంకేతిక కోర్సులు వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. త్వరలోనే ఆమోదం కోసం ప్రతిపాదనలను సీఎం మోహన్ చరణ మాఝికి పంపుతామన్నారు. ఈ వర్సిటీలో దేశంలోని విద్యార్థులతో పాటు విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

# వైసీపీ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం

- ఎంతటివారినైనా వదలిపెట్టం
- టీడీఆర్ బాండ్లలో రూ.700 కోట్ల అవినీతి
- నెల్లూరు విలేకర్ల సమావేశంలో మంత్రి నారాయణ



**విశ్వంభర, అమరావతి :** వైసీపీ ఐదేండ్ల పాలనలో ప్రజాధనం దుర్వినియోగమయిందని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఎంతటి వారినైనా విడిచిపెట్టేది లేదని, వారిని విచారిస్తున్నామని పేర్కొన్నారు. నెల్లూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. తణుకులో టీడీఆర్ బాండ్లలో రూ. 700 కోట్ల అవినీతి జరిగినట్లు తేలిందని అన్నారు. ఈ అక్రమాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే విచారణ కమిటీ వేశాం. నివేదిక కూడా వచ్చింది. సీఎంతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న లేఅవుట్ ఇళ్ల నిర్మాణంపై అనేక వినతులు వస్తున్నాయని, వీటిపై విచారణ జరిపి లబ్దిదారులకు తగిన రీతిలో న్యాయం చేస్తామని వెల్లడించారు. ఏపీలో కూటమిది ప్రజాపాలన ప్రభుత్వమని, ప్రజలనుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రజా వినతులపై సీఎం చంద్రబాబు ఆదేశాలను తప్పకుండా పాటిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కార ప్రత్యేక వేదికలో చాలా మంది వినతులతో వస్తున్నారని, తమ దృష్టికి వస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.

# జగన్ ఎమ్మెల్యే మాత్రమే.. ముఖ్యమంత్రి కాదు..

- ప్రజలు ఆయన్ను ఎన్నుకున్నారు.. కాబట్టి అసెంబ్లీకి రావాలి
- ఎమ్మెల్యేగా గెలిచి సభకు రాను అనడం పద్ధతి కాదు
- ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు



**విశ్వంభర, అమరావతి :** జగన్ ఎమ్మెల్యే మాత్రమే.. ముఖ్యమంత్రి కాదని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ప్రజలు ఆయన్ను ఎన్నుకున్నారు కాబట్టి అసెంబ్లీకి రావాలని సలహా ఇచ్చారు. అన్ని పార్టీలకు ఇచ్చినట్లే తనకూ అవకాశం ఇస్తానని తెలిపారు. అంతేతప్ప ఎమ్మెల్యేగా గెలిచి సభకు రాను అనడం పద్ధతి కాదని స్పష్టం చేశారు. జగన్‌ను ప్రజలు ఎన్నుకున్నారని.. ఆయన్ను ఎన్నుకుంటే మా ప్రాంతం బాగుపడుతుందని అనుకుని ప్రజలు ఎన్నుకున్నారని అయ్యన్నపాత్రుడు అన్నారు. అది పక్కనబెట్టి నేను అసెంబ్లీకి రానని జగన్ అంటున్నాడని.. అసెంబ్లీకి రానడం పద్ధతి కాదని హితవుపలికారు. పగలు ఉంటాయి.. పోతాయి.. ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి అసెంబ్లీకి వచ్చి సమస్యలపై మాట్లాడాలని సలహా ఇచ్చారు. స్పీకర్‌గా తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వనని ఎందుకు ఊహించుకుంటున్నారని ప్రశ్నించారు. అన్ని పార్టీల వాళ్లకు ఇచ్చినట్లే వాళ్లకూ అవకాశం ఇస్తానని స్పష్టం చేశారు. అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చినట్లే వైసీపీకి అవకాశం ఇస్తానని.. కాకపోతే కొన్ని కండీషన్లు ఉన్నాయని అయ్యన్నపాత్రుడు చెప్పారు. సభలో మెంబర్స్‌ను బట్టి క్వశ్చన్స్ వేయొచ్చని చెప్పారు. సభలో తెలుగు దేశం పార్టీకి ఎక్కువ మెంబర్స్ ఉన్నారు కాబట్టి వాళ్లు ఎక్కువ క్వశ్చన్స్ వేయొచ్చని చెప్పారు. ఆ తర్వాత జనసేన పార్టీకి ఎక్కువ క్వశ్చన్స్ వేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఆ తర్వాత కోటా బీజేపీకి ఉంటుందని.. దాని తర్వాత కోటా వైసీపీకి వస్తుందని వివరించారు. అంతేకానీ తనకే అన్ని క్వశ్చన్స్ అడిగే ఛాన్స్ ఇవ్వాలంటే కుదరదని అన్నారు. దానికి కొన్ని రూల్స్, పద్ధతులు ఉంటాయని తెలిపారు. అవన్నీ తెలుసుకుని జగన్ అసెంబ్లీకి రావాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్నారు కాబట్టి మీరు అసెంబ్లీకి రావాలని జగన్‌కు అయ్యన్నపాత్రుడు సూచించారు. ప్రజా సమస్యలు, రాష్ట్ర సమస్యల గురించి మాట్లాడాలని సూచించారు. పద్ధతి ప్రకారం ఎంత టైమ్ ఇవ్వాలో అంత టైమ్ ఇస్తానని తెలిపారు. అంతేతప్ప సభకు రానంటే ప్రజలు ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు.



# వైసీపీ పాలనలో 2,686 హత్యలు

- హత్యా రాజకీయాల గురించి జగన్ మాట్లాడటం
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది
- ఏపీ మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్

**విశ్వంభర, అమరావతి :** రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఏపీ మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ ఆరోపించారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. ఇటీవల నంద్యాల జిల్లా సీతారామపురంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఒకరు చనిపోతే ఉనికి కోసం హత్యను రాజకీయాలకు వాడుకుంటున్నారని జగన్‌పై మండిపడ్డారు. చంద్రబాబుపై కేసు పెట్టాలని జగన్ డిమాండ్ చేయడం శోచనీయమని ఆరోపించారు. వైసీపీ పాలనలో 2,686 హత్యలు జరిగాయని, ఆయనపై కూడా కేసులు పెట్టాలని పేర్కొన్నారు. జగన్ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రేనని విమర్శించారు. వైఎస్ వివేకానందా రెడ్డి హత్యను ప్రశ్నిస్తున్న మీ చెల్లెలు సునితా రెడ్డికి సమాదానం చెప్పాలన్నారు. భారతదేశంలోనే వైఎస్ జగన్ లాంటి క్రిమినల్ లీడర్ లేరని జాతీయ మీడియా సంస్థ పేర్కొన్న విషయాన్ని ప్రస్తావించారు. సీబీఐ కోర్టుకు వెళ్లకుండా ప్రతి శుక్రవారం ఏదో ఒక కార్యక్రమం అంటూ తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడు కూడా హత్య రాజకీయాలను ప్రోత్సహించరని స్పష్టం చేశారు. ఇకనైనా హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకోవాలని మంత్రులు జగన్‌కు సూచించారు. నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్ర మర్డర్, అబ్దుల్ సలాం సూసైడ్ ఘటనలు జరిగినప్పుడు జగన్ నంద్యాలకు ఎందుకు రాలేదు? అని ఎమ్మెల్యే అఖిల ప్రియ ప్రశ్నించారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికపై చంద్రబాబు కసరత్తు

### కూటమి నేతలు వ్యూహాత్మకంగా అడుగులు



**విశ్వంభర, అమరావతి:** ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై తెలుగుదేశం అధినేత చంద్రబాబు కసరత్తు ప్రారంభిం చారు. ఉండవల్లిలోని తన నివాసంలో విశాఖ జిల్లా నేతల తో భేటీ అయ్యారు. వైకాపా అభ్యర్థిగా ఇప్పటికే మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఆ పార్టీ ఖరారు చేసింది. కూటమి తరఫున అభ్యర్థిని బరిలోకి దింపాలని తెలుగుదేశం నిర్ణయించింది. ఇవాళ్లి భేటీలో అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధించాలని కూటమి నేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నా రు. తాజాగా జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో పదికి పది స్థానాలూ గెల్చుకొని జోరుమీదున్న కూటమి నేతలు ఈ నెల 30న జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో గెలుపు లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. బొత్సను గట్టిగా ఎదుర్కొనే అభ్యర్థిని ఎన్నికల బరిలో దించాలని కూటమి నేతలు భావిస్తున్నారు. ఇటీవల కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు, ఆశావహులతో పల్లా సంప్రదింపులు జరిపారు. చంద్రబాబుకు ఆ నివేదిక పంపారు. జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో అనుసరించిన వ్యూహం రీతిలో నే... ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైకాపా వ్యతిరేక ఓట్లపై కూట మి నేతలు దృష్టిసారించారు. మొత్తం 838 ఓట్లున్నాయి. వీటిలోటీడీపీ బలం 200కుపైగా ఉంది. విజయం సాధిం చాలంటే దాదాపు 450 ఓట్లు అవసరం. ఇప్పట కూటమి వైపు దృష్టిసారించిన వారితోపాటు... మరో 90-100 మంది మద్దతు సాధిస్తే సునాయాసంగా విజయం సాధించ వచ్చని భావిస్తున్నారు. ఆ దిశగా ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ ఎన్నిక పర్యవేక్షణ బాధ్యత మంత్రి అచ్చెన్నాయుడుకు అప్పగించగా, అన్ని నియోజకవర్గాలకు ఇన్చార్జులను నియమించనున్నారు.



## పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు భారీగా నిధులు పెంపు

### ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

**విశ్వంభర, అమరావతి :** ఏపీ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల నిర్వహణకు భారీగా నిధులు పెంచింది. గ్రామ పంచాయతీలు, మేజర్ గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం కేటాయిస్తున్న నిధులను వందశాతం పెంచింది. ఇటీవల ఏపీ పంచాయతీ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసిన సర్పంచులు నిధుల పెంపు విషయం చర్చించారు. ఈ సందర్భంగా వచ్చే పంద్రాగస్టు, రిపబ్లిక్ డే నాడు మైనర్ పంచాయతీలకు వంద నుంచి రూ. 10 వేలకు, మేజర్ గ్రామ పంచాయతీలకు రూ. 250 నుంచి రూ. 25, 000 పెంచుతున్నట్లు మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ నిధులతో పాఠశాలల్లో డిబేట్,క్విజ్, వ్యాసరచన పోటీలు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలని సూచించారు. పంద్రాగస్టున స్కూళ్లల్లో స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించాలని , రక్షణరంగంలో పనిచేసినవారిని, పారిశుధ్య కార్మికులను సత్కరించాలని కోరారు. స్కూళ్లు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు ఇవ్వాలని కోరారు.

## రావణాసురుడు రామాయణం చెప్పినట్టుగా జగన్ మాటలు

### ఏపీ మంత్రి నిమ్మల ధ్వజం



**విశ్వంభర, అమరావతి:** మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. రావణాసురుడు రామాయణం చెప్పినట్లుగా వైఎస్ జగన్ మాటలు ఉన్నాయని విమర్శించారు. జగన్‌కు చేసిన తప్పులు పగలు-రాత్రి గుర్తొస్తుండటంతో ఎక్కడ ఎరుపు రంగు కనిపించినా రెడ్ బుక్కే గుర్తుకొస్తుందని అన్నారు. కక్షలు, వేధింపులు, అరాచకాలు, హింస పేర్లు వింటే అందరికీ జగనే గుర్తుకొస్తాడని మండిపడ్డారు. ప్రజా తీర్పు ఓర్వలేను అన్నట్లుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వైఎస్ జగన్‌పై మంత్రి నిమ్మల విమర్శించారు. నంద్యాల ఘటనలో ఎస్సీల భూమిని వైసీపీ నేత కబ్జా చేశారని ఆరోపించారు. గ్రామ పెద్ద వైసీపీ నేత నారప్ప రెడ్డికి భూమి తిరిగి ఇవ్వమని చెప్పడంతో అతనిపై దాడి చేయించారని చెప్పారు. రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవను వ్యక్తిగత స్వార్థం కోసం జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నిమ్మల మండిపడ్డారు. వినుకొండ ఘటనలో అసత్యాలు ప్రచారం చేయడంలో విఫలమై భంగపడిన రీతిలో ఇవాళ నంద్యాలలోనూ జగన్ బోల్తా పడ్డారని విమర్శించారు. శాంతి భద్రతల నిర్వహణలో టీడీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీపడదని జగన్ గుర్తించాలని స్పష్టం చేశారు.

## రైతులను నిర్లక్ష్యం చేయడం సర్కార్‌కు న్యాయమా..?

### కూటమి ప్రభుత్వంపై షర్మిల ఆగ్రహం



**విశ్వంభర, అమరావతి:** ఏపీలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతు పక్షపాతిగా ఉంటామని హామి ఇచ్చి నేడు పట్టించుకోవడం లేదంటూ ట్విట్టర్ ఎక్స్ వేదిక ద్వారా ఆరోపించారు. ఏపీ వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి రైతుల బాధలు కనిపించడం లేదని విమర్శించారు. పల్నాడు జిల్లాలో విత్తనాల కోసం రాత్రివేళల్లో క్యూలైన్లో నిలబెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సాగర్ కుడికాలువ కింద రైతులకు విత్తన కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కుండపోత వర్షంలోనూ మహిళలు విత్తనాల కోసం ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం రైతాంగ శ్రేయస్సు కోసం పనిచేయక పోవడం వల్లే రైతులు కూటమికి పట్టం కట్టారని, మాజీ సీఎం జగన్ నిండా ముంచారు అనే కదా 11 సీట్లకు పరిమితం చేశా రని గుర్తు చేశారు. కనీసం ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. రైతులను వ్యతిరేకించే బీజేపీతో జతకట్టి , రైతు పక్షపాతిగా ఉంటామని హామీలు ఇచ్చి నేడు నిర్లక్ష్యం చేయడం సర్కార్‌కు న్యాయమా అంటూ ప్రశ్నించారు. రైతులకు అవసరమైన జేజీఎల్ 384 రకం విత్తనాలను పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.



## మహిళలకు త్వరలో బస్సు ప్రయాణం

### ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి

**విశ్వంభర, అమరావతి:** ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీ, రవాణా శాఖలపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆర్టీసీ పూర్తిగా నిర్వీర్యమైందని మండిపడ్డారు. కారుణ్య నియామకాలపై చర్చించామన్న ఆయన.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎంతో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో రేషన్, మైన్స్ అక్రమ రవాణాను నివారిస్తామన్నారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను తొలగించి కొత్తవి తీసుకొస్తామని చెప్పారు. ఆర్టీసీలో 7 వేల మంది సిబ్బంది కొరత ఉందని.. వీటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుటుందని తెలి పారు. ఆర్టీసీ, రవాణా శాఖలపై ఈనెల 12న మరోసారి సీఎం సమీక్షిస్తారన్న ఆయన.. మహి ళలకు ఉచిత ప్రయాణం అమలుపై సీఎం చర్చిస్తారని చెప్పారు.

## రూ.4.46 లక్షల కోట్లు పెరిగిన

# ఇన్వెస్టర్ల సంపద..!

**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ శుక్రవారం లాభాలతో ముగియడంతో ఇన్వెస్టర్ల సంపద రూ.4.46 లక్షల కోట్లు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ర్యాలీతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ–30 ఇండెక్స్ సెన్సెక్స్ 819.69 పాయింట్లు వృద్ధితో 79,705.91 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రా డే ట్రేడింగ్ లో సెక్సెక్స్ 1098.02 పాయింట్ల లబ్ధితో 79,984.24 పాయింట్ల గరిష్టానికి చేరుకున్నది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4,46,308.99 కోట్లు వృద్ధి చెంది రూ.4,50,21,816.11 కోట్ల (5.37 లక్షల డాలర్లు) కు పెరిగింది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల్లో ఒడిదొడుకులు ఉన్నప్పటికీ, గ్లోబల్ మార్కెట్ల దన్నుతో దేశీయ ఇండెక్సులు దూసుకెళ్లాయని మెహతా ఈక్విటీస్ రీసెర్చ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సె చెప్పారు. అంతర్గత ట్రేడింగ్లో ఇన్వెస్టర్ల నుంచి ఆల్ రౌండ్ మద్దతు లభించిందన్నారు. శుక్రవారం ట్రేడింగ్‌లో



టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతీయ స్టేట్ బ్యాంక్, రిలయన్స్, ఇన్ఫోసిస్ భారీగా లబ్ధి పొందాయి. మరోవైపు కొటక్ మహీంద్రా బ్యాంక్, సన్ పార్మా నష్టాలను చవి చూశాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ 1.21 శాతం, స్మాల్ క్యాప్ 0.79 శాతం లాభాలతో ముగిశాయి. ఐటీ 1.59 శాతం, కన్జూమర్ డిస్క్రిషనరీ 1.57, రియాల్టీ 1.56, ఆటో 1.51, టెక్ 1.41, క్యాపిటల్ గూడ్స్ 1.37 శాతం లాభాలతో అన్ని ఇండెక్సులు పాజిటివ్ గా ముగిశాయి. బీఎస్ఈలో 2330 స్టాక్స్ లాభాలతో స్థిర పడితే, 1579 స్టాక్స్ నష్ట పోయాయి. మరో 97 స్టాక్స్ యధాతథంగా కొనసాగాయి.

# 15న ఓలా ఎలక్ట్రిక్ బైక్ ఆవిష్కరణ

**ఆరు నెలల్లో సేల్స్ ప్రారంభం**

**విశ్వంభర, బిజినెస్:** ప్రముఖ ఎలక్ట్రిక్ టూ వీలర్స్ తయారీ సంస్థ 'ఓలా ఎలక్ట్రిక్' తన తొలి ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్'ను ఈ నెల 15న ఆవిష్కరించనున్నది. స్వాతంత్ర్య దినోత్సవం నాడు నిర్వహించే 'సంకల్ప్ 2024' వేడుకలో ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ కంఫౌండర్ భవిష్ అగర్వాల్ ఆవిష్కరిస్తుందని సమాచారం. ఇప్పటికే మార్కెట్లో విడుదలైన ఓలా ఎస్1ఎక్స్, ఎస్1 ఎయిర్, ఎస్1 ప్రో స్కూటర్ల సరసన ఈ ఎలక్ట్రిక్ మోటారు సైకిల్ చేరనున్నది. ఈ నెల 15న ఓలా ఎలక్ట్రిక్ తన ఎలక్ట్రిక్ మోటారు సైకిల్ ను ఆవిష్కరిస్తామని ధృవీకరించింది. వచ్చే ఆరు నెలల్లో సదరు ఎలక్ట్రిక్ మోటారు సైకిల్స్ విక్రయం ప్రారంభం అవుతాయని తెలుస్తోంది. టోర్క్ క్రటోస్ ఆర్, రివోల్ట్ ఆర్వీ 400, ఆల్ట్రావయోలెట్ ఎఫ్77 2, మాస్టర్



ఏరియా వంటి ఈవీ మోటారు సైకిళ్లతో పోటీ పడనున్నది. ఫ్రంట్ ఫేసియాలో డ్యుయల్ పాడ్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్, టాప్ పై హరిజొంటల్ ఎల్ఈడీ స్ట్రిప్, పక్కన రెండు వెర్టికల్ స్ట్రిప్స్ తదితర ఫీచర్లు ఉంటాయి. సంప్రదాయ సైడ్ అప్ టెలిస్కోపిక్ ఫోర్క్ సస్పెన్షన్, ట్యూబులర్ ఫ్రేమ్ తో కూడిన లార్జ్ బ్యాటరీ, చైన్ ఫైనల్ డ్రైవ్ వంటి ఫీచర్లు కూడా వాడతారు. తమిళనాడులోని ఓలా ఫ్యూచర్ ఫ్యాక్టరీలో ఈ నెల 15న స్వాంతత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుతాయి.



## హైదరాబాద్‌కు రానున్న బయోటెక్ దిగ్గజం యాంజెన్

**హైదరాబాద్:** అమెరికాకు చెందిన బయోటెక్ దిగ్గజం యాంజెన్.. హైదరాబాద్లో కొత్త టెక్నాలజీ, ఇన్నోవేషన్ సెంటర్ను ప్రారంభించను న్నట్లు శుక్రవారం ప్రకటించింది. హైటెక్ సిటీలో స్పైర్ టవర్లో 2025, మార్చిలోపు తమ పను లను ప్రారంభించనుంది. ఇందులో గరిష్ఠంగా 3,000 మంది నిపుణులకు ఉపాధి లభించనున్నట్లు సంస్థ తెలిపింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, లైఫ్ సైన్స్తో పాటు కాలక్రమేణా ఇతర అదనపు గ్లోబల్ సామర్థ్యా లతో సహా యాంజెన్ వ్యాపారంలోని కీలక రంగాలను బలోపేతం చేసే సేవలను అందిం చనుంది. కాలిఫోర్నియాకు చెందిన ఈ యాం జెన్ సంస్థ 40 ఏళ్లుగా బయోటెక్నాలజీలో అగ్రగామిగా ఉంది. యాంజెన్ (2023లో) 28.20 బిలియన్ డాలర్ల ఆదాయంతో దాదాపు 27 వేల మంది ఉద్యోగులతో ప్రపంచంలోని ప్రముఖ బయోటెక్ కంపెనీల్లో ఒకటి. ఈ సంస్థ భారత్తో సహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాల్లో ఉనికిని కలిగి ఉంది.

# యూపీఐ చెల్లింపులకు బయోమెట్రిక్..




**విశ్వంభర, బిజినెస్:** యూపీఐ చెల్లింపుల గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. పాన్ షాప్ లో చెల్లించే ఐదు రూపాయల దగ్గర నుంచి.. వేలాది రూపాయల లావాదేవీల వరకు ఎంతమొత్తమైనా క్షణాల్లో యూపీఐతో చెల్లింపులు చేయొచ్చు. డబ్బులు పంపేందుకు జస్ట్ నాలుగు/ ఆరంకెల పిన్ ఎంటర్ చేస్తే చాలు.. అవతలి వాళ్ల ఖాతాల్లో డబ్బులు జమ అయిపోతున్నాయి. ఎంతో ఆదరణకు నోచుకున్న ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిద్ధమైంది. ఇకపై యూపీఐ చెల్లింపుల ధ్రువీకరణ కోసం స్మార్ట్ ఫోన్లలో బయోమెట్రిక్ లేదా ఫేస్ ఐడీని –వినియోగించాల్సి రావొచ్చు. ప్రస్తుతం మనం వాడే ఆండ్రాయిడ్ ఫోన్లలో ఫింగర్ ప్రింట్ సెన్సర్ కామన్గా ఉంటోంది. అలాగే. ఐఫోన్లలో ఫేస్ ఐడీ ఉంటోంది. ఇకపై యూపీఐ చెల్లింపుల కోసం ఫోన్లలో ఉండే ఈ బయోమెట్రిక్ ఫీచర్లను వినియోగించుకోవాలని ఎన్పీసీఐ భావిస్తోంది. ఇందుకోసం యూపీఐ సేవలను అందిస్తున్న గూగుల్ పే, ఫోన్ పే, అమెజాన్ పే, పేటీఎం సహా ఇతర యాప్ లతో చర్చలు జరుపుతోంది. అయితే, పిన్ లేదా బయోమెట్రిక్ను ఆయా కంపెనీలు ఆప్షనల్గా ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### ఎందుకీ మార్పు?

చెల్లింపుల కోసం యూపీఐ వ్యవస్థ సులభతరంగా ఉన్నప్పటికీ.. దీన్నే కొందరు సైబర్ నేరగాళ్లు ఆయుధంగా మలచుకుంటున్నారు. డబ్బులు పంపిస్తామని చెప్పి యూపీఐ మనీ రిక్వెస్టులు పెట్టి.. అమాయకుల్ని దోచేస్తున్నారు. సాధారణంగా యూపీఐలో చెల్లింపులు చేసేటప్పుడు పైన డబ్బులు పంపిస్తున్నారనే సందేశం కనిపిస్తూ ఉంటుంది. కొందరు దీన్ని గుర్తించకుండా పిన్ ఎంటర్ చేసి డబ్బులు కోల్పోతున్న ఉదంతాలు ఉన్నాయి.

# వినేశ్ రజతానికి అర్హురాలే : సచిన్ టెండూల్కర్

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్కు చేరిన వినేశ్ ఫొగాట్.. అదనపు బరువు కారణంగా పతకానికి దూరమైన విషయం తెలిసిందే. దీనిపై కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ (సీఏటఎస్) విచారణ జరపనున్న నేపథ్యంలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ స్పందించారు. వినేశ్ ఫొగాట్ రజత పతకానికి అర్హురాలేనన్నారు. అంపైర్ తీర్పునకు సమయం ఆసన్నమైందన్న ఆయన.. వినేశు రజత పతకం వస్తుందని ఆశిద్దామంటూ ఎక్స్లో పోస్టు చేశారు. "ప్రతి ఆటలోనూ నియమాలుంటాయి. వాటిని సందర్భోచితంగా చూడాల్సి ఉంటుంది. స్వచ్ఛమైన ఆటతీరుతో వినేశ్ ఫొగాట్ ఫైనల్కు అర్హత సాధించింది. ఫైనల్కు ముందు అదనపు బరువు కారణంగా అనర్హత వేసి రజత పతకానికి దూరమైంది. ఇందుకు సహేతుక కారణం కనిపించకపోవడంతో పాటు క్రీడా స్ఫూర్తి లోపించినట్లే" అని సచిన్ 'ఎక్స్'లో పేర్కొన్నారు."ఎవరైనా క్రీడాకారుడు తన ప్రతిభను మెరుగుపరచుకునేందుకు డ్రగ్స్ వంటి అనైతిక చర్యలకు పాల్పడి అనర్హతకు గురయ్యారంటే దాన్ని వేరేలా చూడాలి. అటువంటి సమయంలో ఎటువంటి పతకం ఇవ్వకుండా చివరి స్థానంలో ఉంచడం సమర్థనీయమే. కానీ, వినేశ్ మాత్రం న్యాయంగా ఆడుతూ.. ప్రత్యర్థులను ఓడించి ఫైనల్కు చేరుకుంది. ఆమె కచ్చితంగా రజత పతకానికి అర్హురాలే. కాస్ తీర్పు కోసం మనందరం వేచి చూస్తున్న వేళ.. వినేశ్‌కు పతకం వస్తుందని ఆశిద్దాం" అంటూ దిగ్గజ క్రికెటర్ ఆమెకు బాసటగా నిలిచారు.



## హాకీ ఆటగాడు వివేక్‌సాగర్‌కు భారీ నజరానా

**రూ.కోటి రివార్డు, డీఎస్పీ ఉద్యోగం ప్రకటించిన ప్రభుత్వం**



**పారిస్ :** ఒలింపిక్స్ లో భారత హాకీ జట్టు కాంస్య పతకం సాధించిన విషయంతెలిసిందే. గురువారం జరిగిన కాంస్య పతక పోరులో 2–1తో స్పెయిన్పై గెలుపొందింది. కాగా ఈ జట్టులో భాగమైన హాకీ ప్లేయర్ వివేక్ సాగర్ ప్రసాద్ మధ్యప్రదేశ్ కు చెందిన ప్లేయర్ కావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అతడికి భారీ నజరానా ప్రకటించింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ శుక్రవారం వివేక్తో ఫోన్లో మాట్లాడారు. దేశానికి పతకం తెచ్చినందుకు రాష్ట్ర ప్రజల తరపున అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరపున రూ.కోటి రివార్డుతో పాటు డీఎస్పీగా ఉద్యోగం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 52 ఏళ్ల తర్వాత తొలిసారిగా భారత్ స్పెయిన్ను 2–1తో ఓడించి ఒలింపిక్స్లో వరుసగా రెండో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ప్లేయర్లకు హాకీ ఇండియా రివార్డు ప్రకటించింది. ఆటగాళ్లలో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.7.5 లక్షల చొప్పున నజరానా అందించనుంది. మరోవైపు, ఒడిశా సీఎం మాంఝి సైతం హాకీ ప్లేయర్లకు రివార్డు ప్రకటించారు. తమ రాష్ట్రం తరపున ఆటగాళ్లకు రూ. 15 లక్షలు, సహాయక సిబ్బందికి రూ.10 లక్షలు చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే, ఒడిశాకు చెందిన అమిత్ రోహిదాస్కు రూ.4 కోట్ల రివార్డును ఇస్తున్నట్లు తెలిపారు.




## పతాకధారిగా శ్రీజేశ్

**ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో అవకాశం**

**పారిస్ :** ఒలింపిక్స్ ముగింపు కార్యక్రమంలో పతాకధారిగా భారత యువ షూటర్ మను బాకర్ కు ఛాన్స్ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా సీనియర్ హాకీ గోల్ కీపర్ శ్రీజేశకు కూడా ఈ అవకాశం దక్కింది. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. క్రీడాకారుల అభీష్టం మేరకు శ్రీజేశున్ కూడా పతాకధారిగా ఎంపిక చేసినట్లు ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష వెల్లడించారు. శ్రీజేశ్ గత రెండు దశాబ్దాలకు పైగా భారత్ క్రీడలకు, హాకీకి అద్భుతమైన సేవలందించారన్నారు. జావెలిన్ త్రోలో రజతం సాధించిన నీరజ్ చోప్రాతో తాను మాట్లాడానని.. ముగింపు వేడుకల్లో శ్రీజేశ్ పతాకధారిగా ఉండేందుకు అతడు సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిపారు. 'మీరు నన్ను అడగకపోయినా.. నేను శ్రీ భాయ్ పేరు సూచిస్తాను' అని నీరజ్ పేర్కొన్నట్లు ఉష తెలిపారు. ఇక, పారిస్ ఒలింపిక్స్లో భారత యువ షూటర్ మను బాకర్ రెండు పతకాలు సాధించి సత్తా చాటిన విషయం తెలిసిందే.

# కేటీఆర్ గతంలో అమెరికాకు ఎందుకువెళ్లారు?

- సీఎం రేవంత్ రాష్ట్రాన్ని బాగుచేయాలని పనిచేస్తున్నారు
- బీఆర్ఎస్ నేతలు ప్రజల సొమ్మును దోచుకొని ప్రతిపక్షంలో కూర్చున్నారు : మంత్రి కొండా సురేఖ



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ నాయకులూ ప్రజల సొమ్ము దోచుకుని ప్రతిపక్షంలో కూర్చున్నారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుము కున్నట్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా దోచుకునేందుకే కేటీఆర్ గతంలో అమెరికా పర్యటన చేశారని ఆరోపించారు. పెట్టుబడులు రావాలి ..రాష్ట్రం బాగుపడాలి అనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన సాగుతోందని పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడిపై ఆరోపణలు చేయడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. గతంలో కేటీఆర్ షాడో సీఎం గా పనిచేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడేమో కేటీఆర్, బీఆర్ ఎస్ నేతలు పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు బట్టకాల్చి మీదవేసే పని చేస్తున్నారన్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఎంఒయు లు చేసుకున్న కంపెనీలు అన్ని బోగస్ కంపెనీలే అని అన్నారు. బోగస్ కంపెనీలతో ఎంఒయులు చేసుకుని ప్రజలను మోసం చేశారన్నారు. ధాత్రి బయో సిలికేట్ కూడా బోగస్ కంపెనీయే అని పేర్కొన్నారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ, దళిత బంధు, మిషన్ భగీరథ అన్ని స్కామ్ లే, వీటిలో లక్షల కోట్లు దోచుకున్నారన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని అధఃపాతాళంలోకి తొక్కే రోజు ఎంతో దూరంలో లేదని మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు

## సీపీగెట్ ఫలితాలు రిలీజ్

- 61,246 మంది క్వాలిఫై
- 94.57 ఉత్తీర్ణత శాతం

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్) ఫలితాలు వెలువడ్డాయి ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్ లింబాద్రి శుక్రవారం ఈ ఫలితాలను విడుదల చేసారు. సీపీగెట్‌లో మొత్తం 61,246 మంది అర్హత పొందారు. మొత్తం 73,342 మంది దరఖాస్తు చేయగా పరీక్షకు 64,765 మంది హాజరవ్వగా 61,246(94.57%) మంది ఉత్తీర్ణత సాధించారని అధికారులు తెలిపారు. ఇందులో విద్యార్థులు 20,569(94.54%) మంది ఉన్నారు. విద్యార్థినులు 40,677 (94.58%) మంది ఉన్నారు. సీపీగెట్‌లో మొత్తం 41,940 సీట్లు ఉండగా 61,246 మంది అర్హత సాధించారు. కాగా సీట్లు పెరిగేందుకు ఆస్కారముందని అధికారులు స్పష్టంచేశారు. సీపీగెట్ పరీక్షలను జూలై 6 నుంచి 16 వరకు నిర్వహించారు. అభ్యర్థులు తమ ర్యాంక్ కార్డులను www.osmania.ac.in లేదా cpget.tsche.ac.in లేదా www.ouadmissions.com వెబ్ సైట్ నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.




### ఈ నెల 12 నుంచి సీపీగెట్ ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్

సీపీగెట్ ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఈనెల 12 నుంచి ప్రారంభంకానుంది. కాగా 21వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగనుంది. సవరణలకు ఈనెల 26వ తేదీన అవకాశం కల్పించారు. 27 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు చాన్స్ ఇచ్చారు. సెప్టెంబర్ 4వ తేదీన ఫస్ట్ ఫేజ్ సీట్ల అలాట్ మెంట్ చేయనున్నారు. కాగా వచ్చేనెల 9వ తేదీన విద్యార్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసి సీటు రిజర్వ్ చేసుకోవాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభం కానుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana.
Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com

విశ్వంభర

## మహేశ్ బాబుకు నాపై బాగా నమ్మకం : వైవిఎస్ చౌదరి



తాను తెరకెక్కించిన రెండు సినిమాలు చూడకుండానే.. ఓ కథ చెప్పగానే తన దర్శకత్వంలో నటించేందుకు మహేశ్ బాబు అంగీకరించారని దర్శకుడు వై.వి.ఎస్. చౌదరి నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్లో అప్పట్లో తెరకెక్కిన 'యువరాజు' గురించి విశేషాలను పంచుకున్నారు. నందమూరి హరికృష్ణ మనవడు తారక రామారావు హీరోగా వై.వి.ఎస్. కొత్త సినిమా తెరకెక్కించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ నిర్మాణ సంస్థపై ఆయన సతీమణి గీత నిర్మిస్తున్నారు. ఆ సినిమా సంగతులు పంచుకునేందుకు హైదరాబాద్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ.. "మా నిర్మాణ సంస్థకు సంబంధించి.. బాలకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా జూన్ 10న తొలి వేడుక చేశాం. ఇప్పుడు రెండో ఈవెంట్ నిర్వహించాం. మహేశ్ బాబు పుట్టిన రోజున ఫంక్షన్ జరుగుతుండడం సంతోషంగా ఉంది. వైజయంతీ మూవీస్ సంస్థలో నేను అసోసియేట్, కో డైరెక్టర్గా పనిచేశా. నన్ను దర్శకుడిని చేస్తానని నిర్మాత అశ్వనీదత్ అప్పుడే మాటిచ్చారు. ఆ మేరకు నటుడు కృష్ణకు నన్ను పరిచయం చేశారు. రాఘవేంద్రరావు వద్ద పనిచేశానని తెలియడంతో స్టోరీ కూడా వినాల్సిన అవసరం లేదన్నారు కృష్ణ. అలా.. మహేశ్ బాబు 'రాజకుమారుడు'లో నటిస్తున్న సమయంలో ఆయనకు నేను 'యువరాజు' చిత్రానికి సంబంధించి కొన్ని లైన్స్ చెప్పా. మహేశకు నచ్చడంతో ఎవరైనా నిర్మాతను మీరు తీసుకొస్తే నా రెండో చిత్రమే 'యువరాజు' అవుతుందన్నారు. అప్పటికి నేను తెరకెక్కించిన రెండు సినిమాలూ చూడకుండానే ఆయన మాట ఇచ్చారు. అది నాపై ఉన్న నమ్మకం. ఆ సినిమాతో ఏర్పడిన మా అనుబంధం ఇప్పటికీ కొనసాగుతోంది. 'యువరాజు' సమయంలోనే ఆయన సలహా మేరకు బొమ్మరిల్లు పేరుతో ఓ నిర్మాణ సంస్థ స్థాపించా. ఆ తర్వాత కూడా నా వెన్నంటే ఉన్నారు మహేశ్. నేను తెరకెక్కించిన 'లాహిరి లాహిరి లాహిరిలో' ప్లాటినమ్ డిస్క్ ఫంక్షన్ విషయంలో చొరవ తీసుకున్నారు" అని తెలిపారు.

## నాగచైతన్య, శోభిత నిశ్చితార్థంతో సంతోషంగా ఉన్నాం



నాగచైతన్య, నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం గురించి తాజాగా ఓ ఆంగ్ల వెబ్సైట్తో నటుడు నాగార్జున మాట్లాడారు. నిశ్చితార్థం విషయంలో తాము సంతోషంగా ఉన్నట్లు చెప్పారు. విడాకుల అనంతరం చైతన్య ఎంతో బాధపడ్డారని అన్నారు. ఎవరితోనూ ఆ బాధను పంచుకోలేదని తెలిపారు. తన తనయుడు తిరిగి సంతోషంగా ఉండటం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. పెళ్లికి కాస్త సమయం తీసుకుంటామని ఈ సందర్భంగా నాగార్జున వెల్లడించారు. చైతన్య - శోభిత నిశ్చితార్థం గురువారం హైదరాబాద్లో జరిగింది. అతి తక్కువ మంది. కుటుంబసభ్యులు మాత్రమే పాల్గొని వీరిని ఆశీర్వదించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను నాగార్జున సోషల్మీడియాలో షేర్ చేశారు. "నా తనయుడు నాగచైతన్య. శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం గురువారం ఉదయం 9.42 గంటలకు జరిగింది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. నూతన జంటకు నా అభినందనలు. వీరి జీవితం సంతోషం, ప్రేమతో నిండాలని కోరుకుంటున్నా 8.8.8 (08-08-2024) అనంతమైన ప్రేమకు నాంది" అని నాగార్జున పేర్కొన్నారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. చైతన్యకు గతంలో నటి సమంతతో పెళ్లైన విషయం తెలిసిందే. వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. 'గూఢచారి'తో ఆమె తెలుగు తెరకు పరిచయమయ్యారు. 'మేజర్', 'పొన్నియిన్ సెల్వన్', 'మంకీ మ్యాన్' వంటి ప్రాజెక్టుల్లో వర్క్ చేశారు. మరోవైపు, నాగచైతన్య 'తండేల్ తో బిజీగా ఉన్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

## ఆదిపురుష్ పరాజయంతో బాధపడ్డా : కృతిసనన్



'ఆదిపురుష్' పరాజయం గురించి తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నటి కృతిసనన్ స్పందించారు. ఆ సినిమా విజయాన్ని అందుకుంటుందని భావించానని.. అలా జరగకపోవడం తనను బాధించిందని తెలిపారు."మనం నటించిన సినిమా ఏదైనా విజయం సాధించనప్పుడు తీవ్ర కుంగుబాటుకు లోనవుతాం. ఆ బాధను తట్టుకోలేక కొన్నిసార్లు ఏడ్చేస్తాం కూడా. ఎక్కడ ఏం తప్పు జరిగిందోనని ఆలోచిస్తాం. ఎదుటివారి విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీయడం మా లక్ష్యం కాదు. ప్రతి ప్రాజెక్ట్ను మంచి ఉద్దేశంతోనే తెరకెక్కిస్తాం. అయితే, కొన్నిసార్లు అది ఇతరులకు నచ్చకపోవచ్చు. ఇలాంటి సంఘటనల నుంచి ఎన్నో అనుభవాలు నేర్చుకోవాలి. ఒక నటిగా ఆ ఫలితం నుంచి ఎన్నో విషయాలు తెలుసుకుని భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా ఇతర ప్రాజెక్టులపై దృష్టి సారించాలని నిర్ణయించుకున్నా. ఒక సినిమా సక్సెస్కు ఎన్నో అంశాలు దోహదపడతాయి. అవి ఎప్పటికీ నా ఒక్కదాని చేతిలో ఉండవు. నా పాత్రకు సరైన న్యాయం చేశానా? లేదా? అనే ఒక్క విషయం మాత్రమే నా చేతిలో ఉంటుంది. అందుకనుగుణంగా నా పాత్ర కోసం శ్రమిస్తా" అని కృతి చెప్పారు.ప్రభాస్ కీలక పాత్రలో ఓం రౌత్ దర్శకత్వంలో తెరకెక్కిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆది పురుష్' . ప్రభాస్ రాఘవగా, జానకి పాత్రలో కృతిసనన్, లంకేష్ సైఫ్ అలీ ఖాన్ నటించారు. గతేడాది జూన్ లో విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ఇందులోని పలు సన్నివేశాలు తమ మనోభావాలను దెబ్బతీశాయంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.



## అభిమానులు ఆందోళన చెందొద్దు..

### హీరో సూర్యకు జరిగిన ప్రమాదంపై స్పందించిన నిర్మాత

తమిళ స్టార్ హీరో సూర్యకు షూటింగ్‌లో ప్రమాదం జరిగింది. జిగర్తండా డబుల్ ఎక్స్ దర్శకుడు కార్తిక్ సుబ్బరాజు, సూర్య కాంబోలో ఒక సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'సూర్య 44' గా వస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇప్పటికే ఫస్ట్ షెడ్యూల్ అండమాన్‌లో కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ను ఊటీలో జరుపుకుంటుంది. అయితే ఈ షూటింగ్ సమయంలో ప్రమాదం జరగడంతో సూర్య తలకు గాయం అయినట్లు తెలుస్తుంది. ఇక ప్రమాదం అయిన వెంటనే అప్రమత్తం అయిన చిత్రయూనిట్ గాయపడిన సూర్యను స్థానిక ఆసుపత్రికి తరలించారని తెలుస్తోంది.కాగా ఈ విషయంపై నిర్మాత రాజశేఖరన్ పాండియన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. డియర్ ఫ్యాన్స్ ఇది చిన్న గాయం. దయచేసి చింతించకండి, సూర్య ఇప్పుడు కోలుకున్నాడు. మీ అందరి ప్రేమ, ప్రార్థనలతో బాగున్నాడు ఆందోళన చెందొద్దంటూ విజ్ఞప్తి చేశారు.ఇక ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా.. మలయాళం నటుడు జోజు జార్జ్ విలన్ పాత్రలో నటిస్తున్నాడు. మరోవైపు, సూర్య నటించిన 'కంగువ' సినిమా అక్టోబరు 10న విడుదల కానుంది. దర్శకుడు శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు.

## ప్రశాంత్ నీల్ మూవీకి క్లాప్ కొట్టిన ఎన్టీఆర్

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కన్నడ స్టార్ దర్శకుడు కేజీఎఫ్, సలార్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను గతేడాది ప్రకటించగా ఇప్పటివరకు పట్టాలెక్కలేదు. అయితే ఈ క్రేజీ కాంబో షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా.. ఎప్పుడెప్పుడు సినిమా నుంచి అప్‌డేట్‌లు వస్తాయా అని తారక్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ సినిమా షూటింగ్ సంబంధించి సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్.తాజాగా ఈ సినిమా షూటింగ్ నేడు(ఆగస్ట్ 9) పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. రామానాయుడు స్టూడియోస్‌లో ఈ వేడుక జరుగగా.. ఈ వేడుకకు ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇరు కుటుంబ సభ్యులు ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. అయితే ఈ ఈవెంట్‌కు తారక్ హాజరు కావాట్లేదని సోషల్ మీడియాలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వార్తలకు చెక్ పెడుతూ.. ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టాడు. తారక్ భార్య లక్ష్మీ ప్రణతి కెమెరా స్విచ్ ఆన్ చేసింది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ భారీ బడ్జెట్‌తో నిర్మించబోతుంది. ఈ సినిమాను జనవరి 09 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




## ఓటీటీలోకి 'ది బర్త్‌డే బాయ్'..



ఇటీవల రొటిన్ కథలకు కాలం చెల్లిన విషయం తెలిసిందే. అందుకే ఇప్పుడు ఉన్న యువత కొత్తరకం కంటెంట్‌తో వైవిధ్యమైన అప్రోచ్‌తో సినిమాలు తీస్తూ కంటెంట్ ఈజ్ కింగ్ అని నిరూపిస్తున్నారు. అయితే రీసెంట్‌గా విడుదలైన 'ది బర్త్‌డే బాయ్' అనే చిత్రం ఈ కోవలోకే వస్తుంది. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్‌కనకాల ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్' . ఈ సినిమాకు విస్కి దర్శకత్వం వహించగా.. బొమ్మ బొరుసా పతాకంపై నిర్మించారు. యూత్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన ఈ చిత్రం జూలై 19న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అమెరికాలో చదువు కోసం ఒకే వూరి నుండి వెళ్లిన ఐదుగురు స్నేహితులు అక్కడ ఒకే ఇంట్లో వుంటారు. అందులో బాలు అనే స్నేహితుడి పుట్టినరోజు నాడు జరిగిన పార్టీలో మద్యం మత్తులో ఆ స్నేహితులు జరిపిన బర్త్ డే బంప్స్‌లో బాలు అనుకోకుండా చనిపోతాడు. దీంతో ఏం చేయాలో తెలియక ఆ నలుగురు స్నేహితుల్లో ఒకరి అన్నయ అయినా రవికృష్ణకు ఫోన్ చేసి పిలుస్తారు. అక్కడి వచ్చిన రవికృష్ణ ఆ సంఘటన చూసి షాక్ అవుతాడు. అయితే వీళ్ల అందరికి కామన్ ఫ్రెండ్ అయినా ప్రవీణ్.. బాడీని పరిశీలించి ఇది అనుకుకోండా జరిగిన మరణంలా లేదు మర్డర్‌లా వుందని అనుమనిస్తాడు. ఈ లోపు స్నేహితులు అందరూ బాలు వాళ్ల తల్లిదండ్రులను కేసు పెట్టకుండా కన్విన్ చేసి అమెరికాకు రప్పిస్తారు? ఇక ఆ తరువాత కథలో చోటు చేసుకున్న పరిణామాలేంటి? అసలు బాలు కథేంటి? బాలు ఎలా మరణించాడు? బాలు చావుకు బర్త్‌డే బంప్స్ కారణం కాదా? ప్రవీణ్, భరత్‌లు కలిసి వాళ్ల స్నేహితులను ఎలా కాపాడారు? అనేది వెండితెరపై చూస్తేనే ఆసక్తకిరంగా వుంటుంది.